28CTR1:28CTR1.qxd 6/27/2026 11:58 PM Page 1

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ముత్యపు కవచంలో మెరిసిన మలయప్ప

తిరుమల, జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:

జ్యేష్ఠాభిషేకం ఉత్సవాల్లో శనివారం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మలయప్పస్వామి ఉభయనాంచారులతో కలిసి కల్యాణమండపంలో నిత్య వేదోక్త పూజలు అందుకున్నారు, సాయంత్రం మలయప్పస్వామికి,అమ్మవార్లకు ముత్యపు కవచ సమర్పణ వేడుకగా జరిగింది. పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ ఎవిఎస్ఓ రాజశేఖర్, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గణనాధునికి వెండి కొబ్బరికాయ, లడ్డూ విరాళం

కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి శనివారం ఓ భక్తుడు వెండి కొబ్బరికాయ లడ్డూను విరాళంగా అందించారు. ఈమేరకు రాజస్థాన్‌కు చెందిన పీయూష్ అగర్వాల్ అనే భక్తుడు సుమారు 2.50 లక్షల రూపాయల వ్యయంతో కిలో వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన కొబ్బరికాయ, లడ్డూను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణికి అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

జిల్లాలో 1,63,176 మంది
0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

పోలియో మహమ్మరిని తరిమి కొట్టడానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం జరుగనుంది. జిల్లాలో 1,63,176 మంది 0-5 సంవత్సరాల వయస్సు వున్న పిల్లలందరికీ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఆదివారం పోలియో చుక్కల కేంద్రం లోను, పోలియో చుక్కల కేంద్రంకు రాని పిల్లలకు సోమ, మంగళవారాల్లో వారి ఇంటికి వెళ్ళి చుక్కలు వేయనున్నారు. జిల్లాలో పోలియో చుక్కల కార్యక్రమంను పక్కాగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి 'ప్రభాతవార్త'కు తెలిపారు. పోలియో చుక్కల కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా వ్యాప్తంగా 1,077 పోలియో చుక్కల బూత్‌లను ఏర్పాటు చేశామని, ఇందులో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో 186 బూత్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో 891 బూత్‌లు, 63 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేశామ న్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కల బూత్‌ల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. అలాగే సోమ, మంగళవారాల్లో పోలియో చుక్కలు వేయించుకోని పిల్లల ఇళ్ళకు వెళ్ళి వారికి పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లాలో పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రధాన ప్రభుత్వ శాఖల అధికారులు పక్కా ఏర్పాటు చేపట్టి పూర్తి చేశారన్నారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై శ్రీవారు

వడమాలపేట, జూన్ 27 ప్రభాతవార్త:

అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు యోగనారాయణ స్వామి అలంకారంలో సింహ వాహనంపై రాత్రి ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు సింహ వాహనాన్ని అధిరోహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడవీధుల్లో జరిగిన వాహన భక్తిరసాన్ని పంచింది. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ ధర్మాన్ని చాటి చెప్పే స్వామివారు సింహవాహనాన్ని అధిష్టిస్తారు. సింహం పరాక్రమం, ధైర్యం, తేజస్సు, నాయకత్వం, విజయస్ఫూర్తికి ప్రతీక, సింహ దర్శనం ద్వారా భక్తుల్లో ఆత్మ విశ్వాసం, పట్టుదల, ధర్మనిష్ట పెంపొందుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు వివరిస్తున్నాయి. సాయంత్రం 5 గంటలకు స్వామివారు ఊంజల్ మండపానికి వేంచేపు చేయగా, గంట పాటు ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం వాహన మండపం చేరుకున్న శ్రీవారు రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారులు వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన మహాసభ ఏర్పాట్లను
పరిశీలించిన కలెక్టర్. ఎస్పీలు

ఓబులవారిపల్లి జూలై 27 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం ముక్కా వారి పల్లి గురుకుల పాఠశాల ఎదురుగా జూలై నెల 2వ తేదీన జరగనున్న సీఎం మహాసభ స్థలాన్ని శనివారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు పరిశీలించారు. అధికారి యంత్రాంగంతో పాటు కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు బొక్క సాయివికాస్‌రెడ్డిలు ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ కృష్ణ తేజ హాజరయ్యారు. సీఎం పర్యటన సభ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా అణువణువున పరిశీలించారు. విఐపిలకు సంబంధించి మ్యాపులను విడతల వారీ గా పరిశీలించారు.ఎక్కడ ప్రజలకు అధికారులకు ఇబ్బందులు జరగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు పై ఆరా తీశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, సీఎం చంద్రబాబు తో సహా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హాజరుకానున్నారు. తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ ఓబులవారిపల్లి తాసిల్దార్ సిద్దేశ్వర రావు రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసరావు రైల్వేకోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు ఎస్సై సుజన్ కుమార్ ఉపాధి హామీ ఏపీవోలు మృత్యుంజయ నాయుడు మల్లికార్జున్ రాజు ఇరిగేషన్ అధికారులు. కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర సిగమాల మల్లికార్జున్ రెడ్డి బత్తిని వేణుగోపాల్ రెడ్డి ఎర్రబాబు శేఖర్ రెడ్డి ఎర్రబాబు తల్లిం వెంకటరమణారెడ్డి మధుసూదన్ రెడ్డి వెంకటేశ్వరరాజు ఇంటెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.

హీరో పరిశ్రమ శంకుస్థాపన పనులు పరిశీలన

సత్యవేడు, జూన్ 27 ప్రభాతవార్త:

జూలై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీసిటీలో హీరో మోటార్ కార్ప్ ఏర్పాటు చేయనున్న తమ రెండవ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, అధికారులు కంపెనీ ప్రతినిధులతో కలసి కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను, హెలిప్యాడ్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటు, ముఖ్యమంత్రి రాకపోకల మార్గం, భద్రతా ఏర్పాట్లు, అలాగే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో హీరో మోటో కార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీసిటీ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గణనాధుని దర్శించుకున్న రాష్ట్ర డీజీపీ

డీజీపికి ఆలయం వద్ద స్వాగతం పలువుకుతున్న ఆలయ అధికారులు.

కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శనివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో పోలీసు శాఖతో సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర అదనపు డీజీపీ మధుసూధన్‌రెడ్డితో కలసి కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం నవగ్రహ ఆలయంలలో కూడా వారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదమండపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, చిత్తూరు డీఎస్పీ వెంకట రమణ, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఆలయ ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్ ధనపాల్, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, జిల్లా పోలీసుఅధికారులు పాల్గొన్నారు.

మూడో రోజు తెప్పోత్సవం.. ఆధ్యాత్మిక వైభవం

నాలుగోరోజు రాత్రి గజవాహనంపై అమ్మవారు విహారం

తిరుచానూరు జూన్ 27 ప్రభాతవార్త

తిరుచానూరులోని శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం పద్మసరోవరంలో శ్రీ పద్మావతీ అమ్మవారు దివ్య తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులకు అభయ, ఆశీర్వాదాలను ప్రసాదించారు. గోవింద నామస్మరణలు, వేదఘోష, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ ఉత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేయగా గంటపాటు తెప్పోత్సవం జరిగింది. నాలుగో రోజు తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారు తెప్పపై ఐదు చుట్లు విహరించి భక్తులకు దివ్య దర్శనమిస్తారు. అనంతరం సిరుల తల్లి గజవాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహిస్తారు.ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్లు రమేష్, మునిచెంగల్రాయులు, సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

లండన్ వర్సిటీతో ఎంఒయు కుదుర్చుకోనున్న ద్రవిడ వర్సిటీ

- వైస్ ఛాన్సలర్ ఆచార్య మల్లయ్య

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

ద్రవిడ విశ్వవిద్యాలయం త్వరలోనే లండన్‌లోని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వర్సిటీతో మౌఖిక ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంటుందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎల్‌సి మల్లయ్య పేర్కొన్నారు. శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలోని అన్ని వర్సిటీలు అంతర్జాతీయ స్థాయి వర్సిటీలతో మౌఖిక ఒప్పందాలు చేసుకునేందుకు సూచించారన్నారు.ఈ నేపథ్యంలో ద్రవిడ వర్సిటీ త్వరలోనే లండన్ వర్సిటీతో ఎంఒయు కుదుర్చుకుంటుందన్నారు. ఈ ఎంఒయు ద్వారా ఇక్కడి విద్యార్థులు, అధ్యాపకులు లండన్‌లో వెళ్లి చదువుకునే, బోధించే అవకాశాలు లభిస్తా యన్నారు. అలాగే ద్రవిడ వర్సిటీలో త్వరలోనే ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెంటర్‌ను సైతం ప్రారంభిస్తామన్నారు. మును ముందు ద్రవిడ వర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 364కోట్లతో మౌలిక వసతులకు ప్రతిపాదనలు : ద్రవిడ వర్సిటీలో అకడమిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి 364కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వి.సి. ఆచార్య మల్లయ్య తెలిపారు. ఇందులో తొలివిడతగా 200కోట్లు మంజూరుచేసే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అదేవిధంగా వర్సిటీలో కొత్త కోర్సుల ప్రారంభంకు ఎఆర్‌ఎడిసి కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు కొత్త కోర్సులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తామన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ప్రస్తుతం ఉన్న రెండు శాఖలతో పాటు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇసిఇ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్‌ఇపి)కు అనుగుణంగా కోర్సులు నిర్వహిస్తామ న్నారు. అలాగే వర్సిటీలో అన్ని కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (క్యుయెట్)నిర్వహిస్తామన్నారు.

ద్రవిడ భాషలకు ఏకలిపికై కృషి : ద్రవిడ భాషలు అన్నింటికీ కలిపి ఏకలిపి రూపొందించేందుకు వర్సిటీ ప్రయత్నాలు చేస్తోందని వైస్ చాన్సలర్ తెలిపారు.ఇందుకు ఆయా రాష్ట్రాల సహకారం తీసు కునేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వర్సిటీ స్నాతకోత్సవం సెప్టెంబర్ లేదా డిసెంబర్ నెలలో నిర్వహిస్తామన్నారు. వర్సిటీకి అనుబంధంగా డి గ్రీ కళాశాలలు ఉండేలా చర్యలు చేపట్టామని ఇందుకు ప్రభుత్వం అనుమతులు రావాల్సి ఉందన్నారు. పొరుగు రాష్ట్రాల ఆర్థిక సహకారంకై త్వరలోనే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కలవడం జరుగుతుందన్నారు. రానున్న మూడేళ్లలో వర్సిటీని మరింత అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టామన్నారు. వర్సిటీ అభివృద్ధికి చర్యలు చేపట్టిన సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఉన్నత విద్యశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమీషనర్ నారాయణభరత్ గుప్తా,ఉన్నత విద్య కౌన్సిల్ ఛైర్మన్ ఆచార్య మధుమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, ఫైనాన్స్

27CTR 2:27CTR 2.qxd 6/27/2026 11:56 PM Page 1

అందరికి ప్రభుత్వ పథకాలు చేరువ

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి సంఘ సభ్యురాలికి ప్రభుత్వ పథకాలు చేరువ కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు అముద అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘ సభ్యులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ పథకాలు అర్హులైన ప్రతి ఒక్క సంఘ సభ్యురాలికి చేరువ అయితే పేదరికం లేని సమాజం ఏర్పడుతుందన్నారు. జిల్లా సమాఖ్య ప్రతినిధులతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలను సంఘ సభ్యులకు వివరించి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. మండల సమాఖ్యల్లో ఈ అంశాలపై చర్చ జరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అలాగే సంఘ సభ్యులు తీసుకునే ప్రతి ఒక్క రుణం సద్వినియోగం అయితే ఆ మహిళ కొంత వరకు ఆర్థికంగా ఎదుగడానికి క్షేత్ర స్థాయిలో సిబ్బంది చొరవ చూపాలన్నారు. సంఘాలు ఏర్పాటు చేయడంతో సామాజిక చైతన్యం వచ్చిందని, రుణాల విషయంలో ముందస్తు ప్రణాళికలు అవసరం అన్నారు. అర్హతలు, స్థానిక అవసరాలు తదితరాలను పరిగణనలోకి తీసుకుని సంఘాలకు రుణాలను అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సంఘ సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి జిల్లా సమాఖ్య రోవర్ ఎన్జీఓ సంస్థలో సోమవారం ఎంఓయు చేసుకుంది. ఈ సమావేశంలో రోవర్ సిఇఓ శివకుమార్, ఎపిఎంలు సుబ్బారెడ్డి, మధు, పలువురు డిఆర్‌డిఎ అధికారులు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ జలాశయం వద్ద యోగాంధ్ర

పెనుమూరు, జూన్ 27 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కలవగుంట ఎన్టీఆర్ జలాశయం వద్ద ఆదివారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో యోగాంధ్ర.. జలహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపిపి వీరపల్లి హరిబాబునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నీవా, బహుదా, భామీ నదుల సంగమానికి జలహారతి, జల సంరక్షణ ప్రతిజ్ఞ, సామూహిక యోగాభ్యాసం, ఆరోగ్య అవగాహన తదితర కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ముఖ్య అతిధిగా హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన గోపినాధరెడ్డి

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎన్.జయసూర్యను చిత్తూరు న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు కె.గోపినాధరెడ్డి శనివారం చిత్తూరు ఆర్ అండ్‌బి అతిధి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్తూరు కోర్టు భవనంలో శనివారం జరిగే న్యాయమూర్తుల వర్క్‌షాప్‌లో పాల్గొనడానికి హైకోర్టు న్యాయమూర్తి చిత్తూరు వచ్చారు. ఈ సందర్భంగా చిత్తూరు న్యాయశాఖ ఉద్యోగుల బృంద సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘ సభ్యులు రవిరెడ్డి, లక్ష్మీపతి, రాజేష్, రెడ్డప్ప తదితరులతో పాటు పెద్ద ఎత్తున న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన శంకర్‌నాయుడు

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

రాష్ట్ర హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి ఎన్.జయసూర్యను చిత్తూరు న్యాయవాదుల సంఘ అధ్యక్షులు కె.శంకర్‌నాయుడు, కార్యదర్శి కె.సురేష్ రెడ్డిలు చిత్తూరు ఆర్అండ్‌బి అతిధిగృహంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్తూరు జిల్లా కోర్టు భవన సమావేశహాలులో జరిగే న్యాయమూర్తుల సదస్సులో పాల్గొనడానికి వచ్చిన జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిని వీరు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, న్యాయవాదుల సంఘ సభ్యులు తదితరులు వున్నారు.

చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ వాహనాలు

-స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో ఇంటింటి నుండి చెత్త సేకరించడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ పేర్కొన్నారు. చెత్త సేకరణ ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ఒప్పంద ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరలో నగర పాలక సంస్థకు వాహనాలు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. శనివారం కాణిపాకం వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లతో సమావేశం అయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ పనులు, బయో మైనింగ్ తదితర అంశాలపై వీరితో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఇంటింటి చెత్త సేకరణ ఎలక్ట్రిక్ వాహనాలు త్వరలో చిత్తూరుకు వస్తున్నాయని, అలాగే నగర పరిధిలో అవసరమైన చోట్ల పబ్లిక్ టాయిలెట్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఫ్రెష్ వెస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులపై చర్చించారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా పరిశీలన

- మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని సమగ్రంగా, నిబంధనల ప్రకారం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్, ఎఇఆర్ఓ నరసింహప్రసాద్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బిఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పరిశీలన కార్యక్రమంను శనివారం కమిషనర్ పరిశీలించారు. సంతపేట పరిధిలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 2, 5, 45లో బిఎల్ఓలు నిర్వహిస్తున్న సర్వే తీరును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ, ఓటర్లకు సంబంధించిన తల్లిదండ్రులు, బంధువుల ఓటర్ల పరిశీలన తీరును పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేయాలని, సందేహాలు వుంటే అధికారులను అడిగి తెలుసుకోవాలని ఆయన చెప్పారు. ఎసిపి నాగేంద్ర, బిఎల్ఓలు పాల్గొన్నారు.

శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తురాలు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు కర్నాటక హుబ్లీకి చెందిన బోండా జాహ్నవి అనే భక్తురాలు ఈపథకానికి 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొతాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, విఘ్నేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సోయాసాగు రైతులకు లాభదాయకం

- ఎఎంసి చైర్మన్ జిఎం రాజు

గుడుపల్లె, జూన్ 27 ప్రభాతవార్త

రైతులకు సోయాబీన్ పంటసాగు ఎంతో లాభదాయకమని ఎఎంసి చైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు వందశాతం రాయితీతో రాగులు, సోయాబీన్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో సోయాబీన్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సాగు చేసిన పంటను ఎస్‌విఎఫ్ సోయా సంస్థ బైబ్యాక్ విధానంలో కొనుగోలు చేస్తుందన్నారు. మూడు నెలల కాలంలోనే పంట చేతికందుతుందన్నారు. కాగా కుప్పం నియోజకవర్గంలో 2750రూ.ల విలువ చేసే 1275 సోయాబీన్ విత్తనాల బ్యాగులను 35.62లక్షలతో ఉచితంగా అందిస్తోందన్నారు. అలాగే 8లక్షల విలువ చేసే 1900బ్యాగుల రాగి విత్తనాలు రైతులకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేటప్పనాయుడు, ఎఒ రాజ్యలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేతలచే సర్ కార్యక్రమం పరిశీలన

రామకుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంను శనివారం టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎంపిపి గుర్రప్ప పరిశీలించారు. గ్రామాల్లో బిఎల్ఒలు చేపడుతున్న ఫారాల పంపిణీని పరిశీలించారు. ప్రజలు ఏదేని సందేహాలు ఉంటే బిఎల్ఒలను అడిగి పూర్తి సమాచారాన్ని ఫారాల్లో నమోదు చేయాలని సూచించారు. మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని బిఎల్ఒలను కోరారు. అర్హులు ఉంటే ఓటరుగా నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు నాగభూషణం, బాలకృష్ణ, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలకు భూమి కేటాయింపు

వి.కోట, జూన్ 27 ప్రభాతవార్త

యాలకల్లు పంచాయతీ కప్పట్లబండ యానాది కాలనీలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి 5 సెంట్ల ప్రభుత్వ భూమి కేటాయించారు. రోప్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డా. ధనశేఖరన్ 2025లో గిరిజన అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ డైరెక్టర్ మూర్తి స్పందించి కమ్యూనిటీ హాల్లో తాత్కాలిక పాఠశాల ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి 5 సెంట్ల భూమిని కేటాయించారు. ధ్రువీకరణ పత్రాలను డీడీ మూర్తి ఎంఈవో చంద్రశేఖర్‌కు అందజేశారు. డీడీ మూర్తి మాట్లాడుతూ, సొంత భవనం లేక విద్యార్థులు చదువు మానేస్తున్నారని, భవనం వస్తే డ్రాపౌట్స్ తగ్గుతాయన్నారు. మేనేజర్ డా. పౌలురాజ్, మాజీ జెడ్పీటీసీ విశ్వనాథ్ మాట్లాడుతూ, భవన నిర్మాణం త్వరగా పూర్తిచేసి యానాది పిల్లలకు మెరుగైన విద్య అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, స్థానిక నేతలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ధర్మప్ప, రోప్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

వి.కోట, జూన్ 27 ప్రభాతవార్త:

మండల పరిధిలోని సుద్దులకుప్పం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రాత్రిసమయంలో వి.కోట పేర్ణంబట్టు ప్రధాన రహదారిని దాటుతుండగా వి.కోట వైపు నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. తల, కాళ్లకు తీవ్ర గాయాలై అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు గుర్తించకపోవడంతో మృతదేహాన్ని వి.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు వెంటనే వి.కోట పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సోమశేఖర్ రెడ్డి కోరారు.

ఎఎన్ఎం ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్)కు ఉచిత శిక్షణ

చిత్తూరుహెల్త్, జూన్ 27 ప్రభాతవార్త:

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎఎన్ఎం ఎంపిహెచ్‌డబ్ల్యు(హెచ్) ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్, ఒకేషనల్ పాస్, వన్ సిట్టింగ్‌లో ఏ గ్రూప్ అయినప్పటికీ వివాహితులు, అవివాహితులు, వితంతువులు, విడాకులు పొందిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. కనీసం 17 సంవత్సరాల వయస్సు కలిగి గరిష్ట వయోపరిమితి వుండవచ్చునన్నారు. ఈ శిక్షణకు 40 సీట్లు అందుబాటులో వున్నాయని, ఈ కోర్సులో చేరిన వారికి నెలకు రూ.2 వేలు స్టైఫండ్, 2వ సంవత్సరంలో రూ.2,500 స్టైఫండ్ చెల్లించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.50 డిడిని కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, గొల్లపుడి పేరిట చెల్లించాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 30వ తేదీలోపు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్‌కు చేర్చాలన్నారు. వివరాలకు 94415,93026, 92908 14424, 83094 83002, 99639 19406 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

రైతులకు సోయాబీన్ విత్తనాలు పంపిణీ

యామదరి, జూన్ 27 ప్రభాతవార్త:

ఖరీఫ్-2026 సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని వర్షాధారిత సాగును ప్రోత్సహించడానికి వ్యవసాయశాఖ శనివారం రైతులకు సోయా బీన్ విత్తనాల పంపిణీ కార్యక్రమంకు శ్రీకారం చుట్టింది. కాశిరాళ్ళ రైతు సేవా కేంద్రంలో మండల పరిధిలోని రైతులందరికీ ఎస్‌విఎఫ్ సోయా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సోయాబీన్ విత్తనాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా రైతుల నుండి సంస్థ ప్రతినిధులు బైబ్యాక్ ఒప్పంద సంతకాలు స్వీకరించారు. మండలానికి మొత్తం 15 క్వింటాళ్ళ సోయాబీన్ విత్తనాలు అందగా, వాటిలో సుమారు 20 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేపట్టే అవకాశం వుంది. బైబ్యాక్ ఒప్పందం ప్రకారం రైతులు పండించిన సోయాబీన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.45 వేలు చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని ఎస్‌విఎఫ్ సోయా ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ చట్టం-2023తో ప్రత్యామ్నాయ

- చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నినాలా జయసూర్య

వివాద పరిష్కార వ్యవస్థ బలోపేతం

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

మధ్యవర్తిత్వ చట్టం-2023 ద్వారా దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయడానికి రూపొందించబడిన ముఖ్యమైన చట్టమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నినాలా జయసూర్య పేర్కొన్నారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రత్యేక సమావేశ మందిరంలో శనివారం న్యాయాధికారుల సదస్సు-2 జరిగింది. ఈ సదస్సుకు హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నినాలా జయసూర్య అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు నోడల్ అధికారిగా చిత్తూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి అరుణ సారిక వ్యవహరించారు. అలాగే ఈ సదస్సులో రిటైర్డ్ జిల్లా జడ్జి అన్వర్ భాషా, డాక్టర్ ఎస్ రజనిలు రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొని మధ్యవర్తిత్వ విధనం, దాని ప్రయోజనాలు, న్యాయ వ్యవస్థలో దాని ప్రాముఖ్యతపై సమగ్రంగా వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నినాలా జయసూర్య మాట్లాడుతూ 2023 మధ్యవర్తిత్వ చట్టం వివాదాలను వేగంగా, తక్కువ ఖర్చుతో, సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి తోడ్పడుతుందన్నారు. ఈ సదస్సులో 1940, 1996 ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ చట్టాల ముఖ్యాంశాలపై చర్చించారు. కోర్టులపై పెరుగుతున్న భారంను తగ్గించి వివాదాలను త్వరితగతిన, సామరస్యపూర్వకంగా పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వ విధానంను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించాలనే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. తిరుపతిలో న్యాయవాదులు, మధ్యవర్తుల కోసం 40 గంటల సమగ్ర మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. అలాగే చిత్తూరు జిల్లాలో మధ్యవర్తిత్వానికి మొత్తం 520 కేసులు పంపగా వాటిలో 72 కేసులు విజయవంతంగా పరిష్కారమైనట్లు పేర్కొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని మాజీ ఎఎంసి చైర్మన్ సత్యేంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. శనివారం చీలేపల్లి సచివాలయంలో రైతులకు రాయితీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు కుప్పానికి కృష్ణాజలాలు తెచ్చి చెరువులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు మాణిక్యం, మురుగేష్, కమలేష్, రాజేష్, ప్రతాప్ సింహా, గణపతి, రమేష్, తిమ్మరాజు, క్రాంతికుమార్, సుబ్రమణ్యం, జగన్, రామన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా బిజెపి కార్యవర్గ సమావేశంకు కుప్పం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరైనట్లు తెలిపారు. ప్రధానంగా పార్టీని గ్రామీణ స్థాయిలో బలోపేతం చేసేలా ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన పెంచేలా చర్యలు చేపడ్తామన్నారు. ఎన్డీయే పాలనతోనే దేశం పురోగతి దిశగా పయనిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తామన్నారు. వార్డుస్థాయి ను ంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎంబిఎ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్)లో ఏప్రిల్ నెలలో నిర్వహించిన ఎంబిఎ సెకండియర్ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శనివారం బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, అనంతపురం జెఎన్‌టియు పరీక్షల పరిశీలకులు ప్రొఫెసర్ చిత్ర విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో 91శాతం మేర విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల అభినందించారు. నాగలక్ష్మి 92.38శాతం మార్కులతో ప్రథమస్థానం, దీప 91.25, సౌమ్యశ్రీ 91.25శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస 2రన్, హెచ్ఒడి డాక్టర్ మునీంద్ర, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమసుందరం పాల్గొన్నారు.

మహిళల రక్షణకే ధైర్య స్పర్శ : సిఐ

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

మహిళలు, బాలికల రక్షణకే ధైర్య స్పర్శ కార్యక్రమంను పోలీసు శాఖ నిర్వహిస్తోందని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, డిఎస్పీ పార్థసారథి ఆదేశాల మేరకు మండలంలోని పొన్నాంగూరు హైస్కూల్‌లో సిఐ మల్లేష్ యాదవ్ ధైర్య స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ., పోక్సో చట్ట , మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, సైబర్, ఆన్‌లైన్ మోసాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏదేని సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసు శాఖ ఉన్నది ప్రజలు, శాంతిభద్రతల పరిరక్షణకే అని పేర్కొన్నారు.

కెఇసి వైస్‌చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ దాతృత్వం

- ప్రభుత్వ పాఠశాలకు నీటిశుద్ధియంత్రం.. పిల్లలకు స్టేషనరీ పంపిణీ !!

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ తనవంతు సేవా కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్నారు. శనివారం స్థానిక కొత్తపేట ఎంపిపి స్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ఇరవై వేల విలువ చేసే నీటి శుద్ధి యంత్రాన్ని విరాళంగా అందించి ఆయన ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు అవసరమైన స్టేషనరీని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఏ అవసరం ఉన్నా తమవంతు సహాయ సహకారాలను తప్పక అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా హెచ్ఎం కృష్ణప్ప దాత డాక్టర్ సునీల్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్, సభ్యులు శివతేవర్, జయరాంనాయుడు, సెంథిల్‌కుమార్, ఏకాంబరం, మాధవన్, దొరైరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత సాహిత్య అస్తిత్వం..ప్రతిఘటనల పరిశోధన గ్రంథం ఆవిష్కరణ

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

దళిత సాహిత్యంలోని అస్తిత్వం, ప్రతిఘటనల పరిశోధన గ్రంథం అయిన దక్షిణ భారతం లో దళితుల గుర్తింపు మరియు ప్రతికథనాలు పేరుతో రూపొందిన పరిశోధన గ్రంథాన్ని శనివారం ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య మల్లయ్య ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని డాక్టర్ జి. వరదరాజులు, ప్రొఫెసర్ నిర్మల రచించారు. ఈసందర్భంగా ఉపకులపతి రచయితలను అభినందించారు. దళిత సాహిత్య అధ్యయనానికి ఈ గ్రంథం విలువైన పరిశోధన గ్రంథంగా నిలుస్తుందన్నారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లోని ప్రముఖ దళిత నవలలను తులనాత్మక దృష్టితో ఈ గ్రంథంలో విశ్లేషించారన్నారు. దళిత అస్తిత్వ నిర్మాణం, కులవివక్ష, సామాజిక ప్రతిఘటన, సాంస్కృతిక స్వీయ వ్యక్తీకరణ అంశాలపై లోతుగా చర్చించారన్నారు. భారతీయ దళిత సాహిత్య అధ్యయనంలో ఈ గ్రంథం విలువైనదిగా నిలుస్తుందన్నారు.

ప్రజలకు శుద్ధజలాలు అందించేందుకే ఎన్టీఆర్ సుజల

శాంతిపురం, జూన్ 27 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజలకు శుద్ధ జలాలు అందించేందుకే ఎన్టీఆర్ సుజల ట్యాంకులు ప్రారంభిస్తున్నట్లు యూనిట్ ఇన్‌చార్జ్ బాలు, పార్టీ అధ్యక్షుడు శివానంద పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుండిశెట్టిపల్లిలో ఎన్టీఆర్ సుజల ట్యాంకును వారు పునఃప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామస్తులు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునేగౌడు, రెస్కో డైరెక్టర్ అనసూయ, రమేష్, అంజి, నారాయణప్ప, జ్ఞాన కృష్ణమూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

28 -6Pg9th cheli:28 -6Pg9th cheli.qxd 6/28/2026 12:04 AM Page 1

కరకరలాడే సూపర్ చిప్స్

అరటి చిప్స్

కావలసినవి : కూర అరటి కాయలు పెద్దవి-2, ఉప్పు-తగినంత, పసుపు-అర చెంచా, నూనె-వేయించడానికి సరిపడా.

తయారీ : ముందుగా కూర అరటి కాయలను తొక్క తీసి, గుండ్రంగా ముక్కలు కోయాలి. చేతులకు నూనె రాసుకుంటే మంచిది. లేదంటే నల్లగా అవుతాయి. ముక్కల్లో 4 కప్పుల నీళ్ళ, ఉప్పు, పసుపు వేసి, రెండు మూడు నిమిషాలు అలా ఉంచాలి. ముక్కలకు పసుపు, ఉప్పు పట్టిన తర్వాత నీళ్లను పడకట్టేయాలి. వీటినఇ కాగుతుననన నూనెలో వేయించి.. టిష్యూ పేపర్ మీద వేస్తే అదనంగా ఉన్న నూనెను పీల్చేసుకుంటాయి. ఈ టేస్టీ బనానా చిప్స్ గాలి చొరబడని డబ్బాలో భద్రంచేస్తే నెల రోజులు నిలవుంటాయి.

చిలకడదుంప..

కావలసినవి : చిలకడదుంపలు-4, ఉప్పు- తగినంత, కారం- చెంచా, నూనె-వేయించడానికి సరిపడా

తయారీ : చిలకడ దుపంలు కడిగి, పీల్‌చేసి.. స్లైసర్‌తో సన్నగా తరగాలి. వీటిని కాగుతున్న నూనెలో వేయించి, బంగారు రంగులోకి మారగానే తీయాలి. కొద్దిగా చల్లారనిచ్చి కారం, ఉప్పు వేసి కలిపితే సరి. సూపర్ రుచితో చిలకడదుంప చిప్స్ తయారైపోతాయి.

లోటస్ రూట్ చిప్స్ ...

కావలసినవి : తామర వేరు (లోటస్ రూట్)-2 కారం-చెంచా, ఉప్పు-తగినంత, నూనె- వేయించడానికి సరిపడా

తయారీ : పీల్ చేసిన తామరవేరును వీలైనంత సన్నగా స్లైసులుగా కట్ చేసి, పేపర్ టవల్ మీద వేయాలి. చెమ్మ ఇంకిపోయాక కాగుతున్న నూనెలో మూడు నిమిషాలు వేయించాలి. బంగారు రంగులోకి మారగానే తీసి కారం, ఉప్పు చల్లితే నోరూరించే లోటస్ రూట్ చిప్స్ సిద్ధం.

యాపిల్..

కావలసినవి : గ్రీన్ యాపిల్ -రెండు, పంచదార-2 టేబుల్ స్పూన్లు, దాల్చినచెక్క పొడి- చెంచా, డార్క్ చాక్లెట్, ఫ్రెష్ క్రీమ్- అర కప్పు చొప్పున.

తయారీ : తీసేయాలి యాపిల్ కోరర్ సాయంతో వాటి మధ్యలో గింజలతో పెళుసుగా ఉండే భాగాన్ని తీసేయాలి. తర్వాత గుండ్రంగా స్లైసులుగా కట్ చేయాలి. అవి మరీ మందంగా, మరీ సన్నగా లేకుండా మధ్యస్తంగా ఉంటే బాగా వేగుతాయి. ఒక పాత్రలో పంచదార, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. బేకింగ్ ట్రేలో సిలికాన్ మ్యాట్ లేదా బటర్ పేపర్ పరిచి, కాస్త పంచదార చల్లి, యాపిల్ ముక్కలను పేర్చాలి. మిగిలిన పంచదారను ముక్కల మీద చల్లాలి. అవెన్‌ను 130 డిగ్రీల వరకూ ప్రీహీట్ చేసి పది నుంచి పన్నెండు నిమిషాలు బేక్ చేస్తే చిప్స్ తయారవుతాయి. ఈలోగా ప్యాన్‌లో ఫ్రెష్ క్రీమ్‌ను వేడిచేసి, డార్క్ చాక్లెట్ ఉన్న బౌల్‌లో వేసి కలపాలి. ఆ వేడికి చాక్లెట్ కరిగిపోతుంది. ఈ సిరప్‌తోయాపిల్ చిప్స్ తింటే యమ్మీగా ఉంటాయి.

పనస ..

కావలసినవి : కాస్త పచ్చిగా ఉన్న పనసపండు తొనలు-20, ఉప్పు- తగినంత, పసుపు-పావు చెంచా, మిరియాల పొడి- అరచెంచా, నూనె- వేయించడానికి సరిపడా.

తయారీ : పనస తొనల్లో గింజలు తీసేసి సన్నగా పొడుగ్గా ముక్కలు కోసుకోవాలి. కడాయిలో నూనె కాగనిచ్చి. పనస ముక్కలను కొన్ని కొన్ని చొప్పున హై ఫ్లేమ్‌లో రెండు నిమిషాలుంచాలి. సెగ తగ్గంచి బంగారు రంగులోకి మారేదాకా వేయించి తీయాలి. చల్లారిన తర్వాత ఉప్పు, పసుపు మిరియాల పొడి వేసి అన్నిటికీ పట్టేలా ఎగరేస్తూ కలపాలి. అంతే రుచికరమైన పనస చిప్స్ రెడీ.

కాకర..

కావలసినవి : కాకరకాయలు-4, శనగపిండి, మొక్క జొన్న పిండి, బియ్యపిండి-2 టేబుల్ స్పూన్ల చొప్పున, ఆమ్‌చూర్ పౌడర్, పసుపు-చెంచా చొప్పున, కారం- ఒకటిన్నర చెంచా, ఉప్పు- తగినంత, నూనె- వేయించడానికి సరిపడా.

తయారీ : ముందుగా కాకరకాయలను కడిగి, తడి లేకుండా ఆరబెట్టాలి. వాటిని గుండ్రంగా లేదా నిలువుగా అన్నీ సమానంగా ఉండేలా కట్ చేసుకోవాలి. శనగపిండి, మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, కారం, ఆమ్‌చూర్ పౌడర్, పసుపు, ఉప్పు.. అన్నీ వేసి బాగా కలపాలి. ముక్కలను పిండితే మెత్తగా అయిపోతాయి. కనుక మెల్లగా, జాగ్రత్తగా కలపాలి. కడాయిలో నూనె కాగిన తర్వాత మీడియం ఫ్లేమ్ మీద ఈ ముక్కలను దోరగా వేయిస్తే సరిపోతుంది. చేదు విరిగిపోయి కరకరలాడే కాకర చిప్స్ రెడీ. తిని ఆనందించడమే తరువాయి. ◻

లాలి పాడితేనే..

పిల్లలు గలగలా మాట్లాడే స్తుంటే వచ్చే ఆనందమే వేరు కదూ! మరి పిల్లల్లో భాషా నైపుణ్యాలు మెరుగుపడాలంటే ఏం చేయాలో తెలుసా! సాధారణంగా పసి వాళ్లకు మాటలు నేర్పించే క్రమంలో అమ్మ, నాన్న , తాత.. అంటూ పదాలు చెబు తుంటాం కానీ నిజానికి ఏడు నెలలు వచ్చే వరకూ పసి పిల్లలు ఆ పదాలను అర్థం చేసు కోలేరట. పదకొండు నెలల వరకూ అస్పష్టంగానే అర్థమవుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ◻

నేర్చుకుంటేనే గెలవగలం !

తమ కలల్ని నెరవేర్చు కుంటూ కోరుకున్న ఉద్యోగంలో కుదురుకున్నా.. పదోన్నతులు అందుకోవడంలో కొందరు వెనకబడుతుంటారు. ఇలాంటప్పుడు పనితీరుని సమీక్షించుకోవడం చాలా అవసరం అదెలాగంటే..

లక్ష్యాలకు తగ్గ ప్రణాళిక: ప్రతి ఒక్కరికీ కొన్నిన లక్ష్యాలు ఉండాలన్నది నిజమే అయినా.. వాటిని సాధించడానికి మీ దగ్గర సరైన ప్రణాళిక ఉందో లేదో చూసుకోండి. ఎందు కంటే విజయ తీరాలకు చేరిన వారందరికీ స్పష్టమైన ఆలోచన, ప్లాన్ తప్పనిసరిగా ఉంటాయి మరి. అదీ డాక్యు మెంటేషన్ అయి ఉండాలి. లేదంటే మీ ఆలోచనలన్నీ నీటి మీద రాతలే అవుతాయి. కాలంతో పోటీపడాలి:. ప్రణాళిక వేసుకోగానే విజయం మీ చెంతకి వచ్చేయదు. కాలంపై పట్టు, పనిపై అవగహన కూడా ఉండాలి. ఎంత కష్టమైనా సరే, అనుకున్న గడువు కంటే ముందు చేయ గలగాలి. ఇది ఒక్క సారిగా అలవడకపోవచ్చు. కానీ, ప్రయత్నిస్తే సాధ్యమే. ఎందుకంటే ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ కాలం కంటే వేగంగా పరుగెడితేనే గమ్యాన్ని చేరుకునేది.

నేర్చుకోండి: ఉద్యోగంలో చేరాం హమ్మయ్య అనకుని సరిపెట్టేసుకోకండి. ఎప్పటికప్పుడు మార్కెట్ పోకడల్ని తెలుసుకుంటూ నైపుణ్యాలను ఒంట పట్టించుకోవాలి. ప్రముఖ సంస్థలు అప్పుడప్పుడూ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటాయి. అలాంటి వాటిని వినియోగించుకుని నైపుణ్యా లతో పాటు జీవన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి.

విశ్లేషించుకోండి.. చిన్న విజయానికే పొంగిపోవడం, వెనకబడినప్పుడు కుంగిపోవడం సరికాదు. ఎట్టి పరిస్థితు ల్లోనూ మానసిక స్థైర్యాన్ని కోల్పోకూడదు. పొరపాటు జరిగితే కారణాలను నిశితంగా పరిశీలించుకోవాలి. విశ్లేషించుకుని.. మరోసారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే పనిలో నైపుణ్యం సాధించడంతో పాటు పదోన్నతులూ అందుకోగలుగుతారు. ◻

అంతర్వాణి

దేవుడి వాక్యం మనల్ని బతికిస్తుంది..

ఎబినేజర్ అనే ఒక యవ్వనుడు ఉన్నాడు. అందరూ అతడిని ఎబ్బి అని పిలుస్తుంటారు. ఎబ్బి దేవుడి పరిచర్య (సేవ) నిమిత్తం ఆస్ట్రేలియాకు పయనమ య్యాడు. ఆయన ఎప్పుడూ విమానం ఎక్క లేదు. అదే మొదటిసారి ప్రయాణం చేయడం. ఎంతో ఉత్సాహంతో అందరికీ బై..బై చెప్పి, వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. కొద్దిసేపు తర్వాత ఎయిర్ హోస్టెస్ ఎబ్బి వద్దకు వచ్చి 'సార్ కాఫీతాగుతారా? లేక కూల్డ్రింక్ తాగుతారా?' అని అడిగింది. అందుకు ఆ యువకుడు 'నాకేమీ వద్దన్నాడు'. ఆయన పక్క సీట్లోకూర్చున్న వ్యక్తి కూల్‌డ్రింక్ కావాలని చెప్పి, దాన్ని తెప్పించుకుని తాగాడు. ఈ కుర్రాడు మాత్రం తాగు.. బాగా తాగు.. బిల్‌బోల్డెంత వస్తుంది అని మనసులో అను కున్నాడు. కొద్దిసేపు తర్వాత ఆమె మళ్లీ వచ్చి, 'భోజనం కావాలా సార్?' అని అడిగింది. అందుకు ఎబ్బి, భోజనం అంటే చాలా డబ్బు అవుతుంది, ఆకలి అవుతున్నా.. వద్దన్నాడు. పక్కన ఉన్న వ్యక్తి మాత్రం భోజనం తెప్పించు కుని, శుభ్రంగా తిన్నాడు. ఇలా హెయిర్ హోస్టెస్ ఏమి అడుగుతున్నా ఆ యువకుడు వద్దంటూనే ఉన్నాడు. పక్కను వ్యక్తి మాత్రం తనకు కావాల్సి నవన్నీ తెప్పించుకుని, తింటున్నాడు. చివరికి ఇద్దరూ విమానం దిగారు. అప్పుడు ఎబ్బి తన పక్కనున్న వ్యక్తితో నడుస్తూ, సార్! మీరు అన్ని ఐటమ్స్ తిన్నారు కదా?, బిల్ ఎంత వచ్చింది? అని అడిగాడు. అందుకు ఆయన బిల్లా?, అవన్నీ ఫ్రీగానే ఇస్తారు కదా? టికెట్పై రాశారు కదా? అని ప్రశ్నించారు. అప్పుడు ఆ యువకుడు సిగ్గుతో బాధపడ్డాడు. తన చేతిలో టికెట్ ఉన్నా.. దాన్ని సరిగ్గా చదవ లేకపోయి నందుకు చింతించాడు. మన చేతిలో దేవుడు బైబిల్ పెట్టాడు. కానీ దేవుడి వాక్యాన్ని చదివేందుకు టైమ్ లేదంటారు, అర్థం కావడం లేదంటారు, చదివేందుకు ఇష్టం కలగడం లేదంటుంటారు. కానీ అందులో ఎన్నో అమూల్యమైనవి ఉన్నాయి. మనం ఎలా జీవించాలి.. ఏవి చేయాలి, ఏవి చేయకూడదు అన్ని దేవుడు అందులో రాసి ఉంచాడు. చేతిలో టికెట్ ఉన్నా ఏమీ తినలేక, ఆకలితో అలమటించిన ఎబ్బిలాటమనం కూడా అనేకమైన కొరతలతో అలమటి స్తున్నాం. నీ వాక్యం నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నదిఖి (కీర్తనలు 119:105), నీ వాక్యము నన్ను బ్రదికించియున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది (కీర్తన 119:50). అవును దేవుడి వాక్యం మనల్ని బతికించడం మాత్రమే కాదు, నిత్యం మనల్ని నడిపిస్తుంది. కాబట్టి బైబిలు చదవడం అశ్రద్ధ చేయవద్దు..

- పి.వాణిపుష్ప

తెర

ప్రొడక్షన్ నెం.1 ప్రారంభం

మీరా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మోర్య సిద్ధవరం, తన్వి ఆకాంక్ష హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం శనివారం లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. హైద రాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన ఈ కార్య క్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా..అల్లు స్నేహ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సందర్భంగా... నిర్మాత సందీప్ రామినేని (శాండి) మాట్లాడుతూ మా బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.1 మూవీగా రాబోతోన్న ఈ సినిమా ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్. డైరెక్టర్ గీత సి.శేఖర్ ఫన్ ఎంటర్‌టైనింగ్ కంటెంట్‌తో సినిమాను రూపొందిస్తూనే ఓ ఎమోషనల్ టచ్‌తో ఉండేలా స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. మోర్య, తన్వి జోడీ

క్యూట్‌గా మెప్పించనున్నారు. ఆగస్ట్ నుంచి షూటింగ్‌ను ప్రారంభించబోతున్నాం. త్వరలోనే సినిమాలోని ఇతర నటీనటులు, టెక్నీషియన్స్‌కు సంబంధించిన వివరాలను తెలియజేస్తాం అన్నారు.

'హే చికీతా' టీజర్ లాంచ్

అమరావతి మూవీ మేకర్స్, సుందరకాండ మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ల మీద ఎన్. అశోక ఆర్ఎన్ఎస్, గరుడవేగ్గ అంజి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'హే చికీతా'. ఈ మూవీకి ధన్ రాజ్ లెక్కల దర్శకత్వం వహిం చారు. ఈ సినిమాలో అభినవ్ మణికంఠ, దివిజ, తన్మయి కుషి ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని జూలై 24న విడుదల చేయ బోతోన్నారు.సి. కళ్యాణ్ మాట్లా డుతూ.. .. అంజి నా శిష్యుడు. అతనికి మంచి టాలెంట్ ఉంది. మా ప్రభాకర్ కూతురు దివిజకు మంచి విజయాలు దక్కాలి. నిర్మాతగా అశోక్‌ని తెలుగులోకి తీసుకు వస్తుండటం ఆనందంగా ఉంది. ప్రభాకర్ మాట్లా డుతూ..'హే చికీతా'కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఇంత మంచి గెస్టులు రావడం చూస్తుంటే ఇక్కడే సక్సెస్ అయినట్టుగా అనిపిస్తోంది. దర్శకుడు ధన్‌రాజ్ లెక్కల మాట్లాడుతూ.. .. అంజి వల్లే నాకు డైరెక్షన్ ఛాన్స్ వచ్చింది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన అశోక్‌కి థాంక్స్. హీరో అభినవ్ మణికంఠ మాట్లాడుతూ.. 'హే చికీతా'ను అంజి గారి వల్లే చేశాం. చరణ్ అర్జున్ వల్లే నాకు ఈ అవకాశం వచ్చింది. నిర్మాతగా, డీఓపీగా అంజి కష్టాన్ని మేం చూశాం. అశోక్ గారు మా వెన్నంటే నిల్చున్నారు. ధన్ రాజ్ లెక్కలకు మంచి టాలెంట్ ఉంది. .దివిజ ప్రభాకర్ మాట్లాడుతూ.. 'హే చికీతా' కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అంజి, అశోక్ మాకు అండగా నిలిచారు. సింగిల్ షెడ్యూల్‌లో కేవలం 21 రోజుల్లోనే షూటింగ్ ఫినిష్ చేశాం. నిర్మాత గరుడవేగ అంజి మాట్లాడుతూ.. కొత్త కథల్ని అందించాలనే ఉద్దేశంతోనే ఈ బ్యానర్లను ప్రారంభించాం. మా ఆధ్వర్యంలో మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి. 'హే చికీతా' అద్భుతంగా వచ్చింది.

పుత్రన్ కొత్త సినిమా 'విజయం'

హీరో నివీన్ పాలీ, డైరెక్టర్ ఆల్ఫోన్స్ పుత్రన్ కాంబోకు పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ ఉంది. వీరు కలిసి చేసిన నేరం, ప్రేమమ్ చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. ఇలాంటి క్రేజీ కాంబో 12 ఏళ్ల తర్వాత కలిసి సినిమా చేస్తున్నారంటే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకో వచ్చు. ఈ అంచనాల మధ్య నివీన్ పాలీ, ఆల్ఫోన్సో పుత్రన్ కొత్త సినిమాకు 'విజయం' అనే టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాను సినీ హోలిక్స్, పాలీ జూనియర్ పిక్చర్స్ బ్యానర్స్ పై టాన్సన్ టోనీ, సునీల్ రమది నిర్మిస్తున్నారు. కేరళ ఎర్నాకుళంలోని పద్మ థియేటర్‌లో అభిమా నుల సందడి మధ్య 'విజయం' సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్ వీడియో ను రిలీజ్ చేశారు. ఎంటర్ టైనింగ్ గా రూపొందించిన ఈ వీడియో ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది.

వైవిధ్య చిత్రాల భాగ్యరాజా

దర్శక దిగ్గజం కె. భాగ్యరాజ్ కన్నుమూత ప్రముఖ సినీ దిగ్గజం కె. భాగ్యరాజ్ 73 ఏళ్ల వయసులో శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. తమిళ సినీ పరిశ్రమలో కథా రచయితగా, దర్శకుడిగా, నటుడిగా చెరగని ముద్ర వేసిన ప్రముఖ సినీ దిగ్గజం కె. భాగ్యరాజ్ 73 ఏళ్ల వయసులో శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. దశాబ్దాల పాటు తన ప్రత్యేకమైన కథలతో, కుటుంబ విలువలను ప్రతిబింబించే సినిమాలతో ప్రేక్షకులను అలరించిన భాగ్యరాజ్ మరణం తమిళ సినీ పరిశ్రమకు తీరని లోటుగా భావిస్తున్నారు. ఆయన అంత్య క్రియలకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కె.భాగ్యరాజ్‌కు భార్య, ప్రముఖ నటి పూర్ణిమ భాగ్యరాజ్, కుమారుడు నటుడు శాంతను భాగ్యరాజ్, కుమార్తె శరణ్య భాగ్యరాజ్ ఉన్నారు. ఇటీవల వరకు ఆయన ప్రజా జీవితంలో యాక్టివ్ గా కొనసాగారు. రీసెంట్‌గా నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ కూతురి పెళ్లి వేడుకల్లో పాల్గొని అందరితో ఆప్యాయంగా మమేకమయ్యారు. ఇంతలోనే ఆయన మరణ వార్త సినీ అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో కృష్ణస్వామి భాగ్యరాజ్‌గా జన్మించిన ఆయన, తన సినీ కెరీర్ ను ప్రముఖ డైరెక్టర్ భారతీరాజా వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా స్టార్ట్ చేశారు. అక్కడి నుంచి తన టాలెంట్‌తో డైరెక్టర్‌గా, రైటర్‌గా ఎదిగి తమిళ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల ఎమోషన్స్, సామాజిక అంశాలు, సహజమైన పాత్రలతో కూడిన కథలను తెరపై ఆవిష్కరించడంలో ఆయనకు ప్రత్యేకమైన శైలి ఉండేది 1980, 1990 దశకాల్లో తమిళ సినిమాకు ఆయన అందిం చిన కథలు, స్క్రీన్‌ప్లేలు కొత్త ఒరవడిని తీసుకొచ్చాయి. డైరెక్టర్‌గా 25కి పైగా సినిమాలకి దర్శకత్వం వహించిన భాగ్యరాజ్, నటుడిగా 75కు పైగా సినిమాల్లో నటించి బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. ఆయన రచనల్లో కనిపించే భావోద్వేగం, హాస్యం, కుటుంబ బంధాల చిత్రణ ప్రేక్షకులను ఇప్పటికీ ఆకట్టుకుం టూనే ఉన్నాయి. ఆయన దర్శకత్వంలో వచ్చిన ముందానై ముడిచ్చు, అంధా 7 నాట్కల్, డార్లింగ్.. డార్లింగ్.. డార్లింగ్ వంటి సినిమాలు కోలీవుడ్‌లో క్లాసిక్ సినిమాలుగా నిలిచాయి. కథనాన్ని ఆసక్తికరంగా మలచడం లో భాగ్యరాజ్‌కు ఉన్న నైపుణ్యం కారణంగా ఆయనను తమిళ సినీ పరిశ్రమలో అత్యుత్తమ స్క్రీన్‌రైటర్లలో ఒకరిగా భావిస్తారు. భాగ్యరాజ్ టాలెంట్ ను అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి, సినీ దిగ్గజం ఎంజీఆర్ కూడా బహిరంగంగా ప్రశంసించారు. సినీ రంగంలో తన వారసుడిగా అభివర్ణిం చడం ఆయనకు లభించిన అత్యున్నత గౌరవాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. అంతేకాదు తమిళంతో పాటు హిందీ చిత్రసీమలో కూడా భాగ్యరాజ్ తనదైన ముద్ర వేశారు. అమితాబ్ బచ్చన్ ద్విపాత్రాభినయం చేసిన ఆఖ్రీ రాస్తా సినిమాకి ఆయన దర్శకత్వం వహించగా, ఆ సినిమా కమర్షియల్ గానే కాక విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. దీంతో ఆయన టాలెంట్ దక్షిణాదికే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. భాగ్యరాజ్ మరణంతో భారతీయ సినీ పరిశ్రమ ఓ గొప్ప కథకుడిని కోల్పోయింది. ఆయన రూపొందించిన సినిమాలు, రచనలు, తెరపై ఆవిష్కరించిన పాత్రలు తరతరాల ప్రేక్షకుల హృదయా ల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

'నాగబంధం' నుంచి 'వీరనాగ' సాంగ్ రిలీజ్

'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో భారీ అంచనాలను పెంచింది. దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో విరాట్ కర్ణ హీరోగా నటించారు. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నాగార్కర్ కీలక పాత్రల్లో నటించారు. 'వీరనాగ' పాట నాగ సాధువుల ఆధ్యాత్మిక తాండవాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. శ్రీహర్ష ఈమని సాహిత్యం ఆధ్యాత్మిక భావాన్ని బలంగా ప్రతిబింబించగా, దీపక్ బ్లూ తన పవర్ ఫుల్ వోకల్స్ తో పాటకు ప్రాణం పోశారు. జునైద్ కుమార్ - అభే అందించిన సంగీతం ప్రతి ఫ్రేమ్‌లో భక్తి భావాన్ని మరింత ఎలివేట్ చేసింది. కైలాస పర్వతాన్ని తలపించే అద్భుతమైన నేపథ్యంతో తెరకెక్కించిన ఈ పాటలో నాగ సాధు తాండవం విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. నాగ సాధుగాగా విరాట్ కర్ణ తాండవం కట్టిపడేసింది. ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా వున్నాయి. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ పాటలోని హైలైట్స్‌లో ఒకటిగా నిలిచింది.వీర నాగ పాటతో 'నాగబంధం'పై అంచనాలు మరింత పెరిగాయి. పురాణ గాథలు, ఆధ్యాత్మికత, విజువల్ గ్రాండియర్‌ను మేళవించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినీ అనుభూతిని అందించబోతోందనే నమ్మకాన్ని ఈ పాట మరింత పెంచింది. నాగబంధం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది.

'సోల్జర్ - 24x7 ఆన్ డ్యూటీ' ఫస్ట్ లుక్ విడుదల

కొనంకి ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ ప్రతిష్ఠాత్మక యాక్షన్ థ్రిల్లర్ 'సోల్జర్ - 24 7 ఆన్ డ్యూటీ' చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసింది. దేశభక్తి, ధైర్యం, త్యాగం, కర్తవ్య నిబద్ధతకు ప్రతీకగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కొనంకి కార్తీక్ శక్తివంతమైన సైనికుడి పాత్రలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. యుద్ధ వాతావరణం, పోరాట ఛాయలు, గర్వంగా రెపరెపలాడు తున్న భారత త్రివర్ణ పతాకం మధ్య ఆయన లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. '24 7 ఆన్ డ్యూటీ' అనే ట్యాగ్‌లైన్‌తో దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తూ దేశ భద్రత కోసం అహర్నిశలు కృషి చేసే భారత సైనికులకు ఈ చిత్రం ఘన నివాళిగా నిలవనుంది.ఈ చిత్రంలో కొనంకి కార్తీక్ మరియు ప్రియాంక వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రద్ధ ఖత్రి దర్శకత్వం వహిస్తున్నారు. కె. వి. నాయుడు కొనంకి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, దేశభక్తి, మానవీయ విలువల సమ్మేళనంగా ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది.

మరో ముగ్గురిపై ఎన్ఐఏ ఛార్జిషీటు

ఢిల్లీ రెడ్‌ఫోర్ట్ కారుబాంబు పేలుడు కేసు

మొత్తం 13కు పెరిగిన నిందితులు

న్యూఢిల్లీ, జూన్ 27: దేశ రాజధాని ఢిల్లీలోని రెడ్ ఫోర్ట్ సమీపంలో 2025 నవంబర్ 10న జరిగిన ఘోర కార్ బాంబు పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మరో ముగ్గురు నిందితులపై అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రత్యేక ఎన్ఐఎ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో జమ్మూ కాశ్మీర్‌కు చెందిన జమీర్ అహ్మద్ అహంగర్, తుఫైల్ అహ్మద్ భట్, పరారీలో ఉన్న ముజాఫర్ అహ్మద్ అలియాస్ ఫరాజ్ అలియాస్ జఫర్ పేర్లను నిందితులుగా చేర్చింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు చార్జిషీట్ ఎదుర్కొంటున్న వారి సంఖ్య 13కు చేరింది. పేలుడులో మరణించిన ప్రధాన నిందితుడు ఉమర్ ఉన్ నబీ కూడా ఇందులో ఉన్నాడు. దర్యాప్తులో పరారీలో ఉన్న ముజాఫర్ అహ్మద్ చిన్నపిల్లల వైద్య నిపుణుడిగా పనిచేస్తున్నట్లు గుర్తించిన ఎన్ఐఎ, అతను అల్‌ఖైదాకు అనుబంధంగా ఏర్పడిన ఏజీయూహెచ్ ఇంటరిమ్ సంస్థ వ్యవస్థాపక సభ్యుడని వెల్లడించింది. ఈ పేలుడు కుట్రకు ఉమర్, ముజమ్మిల్, ఆదీల్, ముఫ్తీ ఇర్ఫాన్‌లతో కలిసి ప్రధాన సూత్రధారుల్లో ఒకడిగా వ్యవహరించినట్లు తెలిపింది. 2022 జూన్‌లో శ్రీనగర్ ఈద్గాహ్‌లోజరిగిన రహస్య సమావేశంలో ఈ ఉగ్ర మాడ్యూల్ ఏర్పాటుకు ముజాఫర్ హాజరైనట్లు దర్యాప్తులో తేలిందని ఎన్ఐఎ పేర్కొంది. ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ యూనివర్సిటీలో రహస్యంగా నిర్వహించిన ఐఇడి కేంద్రంలో టిఎటిపి ఆధారిత పేలుడు పదార్థాల తయారీ, పరీక్షలు, నిల్వ ప్రక్రియల్లో కూడా అతను కీలకంగా పాల్గొన్నట్లు వెల్లడించింది. ముజాఫర్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు, అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎన్ఐఎ తెలిపింది. ఇక జమీర్ అహ్మద్ ఉగ్ర మాడ్యూల్‌కు ఓవర్‌గ్రౌండ్ వర్కర్‌గా పనిచేస్తూ ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నగదు రవాణాలో కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మరో నిందితుడు తుఫైల్ అహ్మద్ భట్ నిషేధిత లష్కరే తోయిబా మాజీ ఓవర్‌గ్రౌండ్ వర్కర్‌గా ఉండి, ఉగ్రవాదులకు ఆయుధాలు సరఫరా చేసినట్లు ఎన్ఐఎ తెలిపింది. హ్యాండ్లర్ సూచనల మేరకు ఎకె47 రైఫిల్, క్రింకోవ్ రైఫిల్, పిస్టల్, మ్యాగజైన్లు, మందుగుండు సామగ్రిని రూ.3 లక్షలకు ప్రధాన నిందితుడు ఉమర్ ఉన్ నబీకి అందజేసినట్లు పేర్కొంది. జమీర్, తుఫైల్‌లపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం యుఎపిఎ, భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది.

పరారీలో ఉన్న ముజాఫర్‌పై అదనంగా పేలుడు పదార్థాల చట్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కూడా అభియోగాలు మోపింది. ఫోరెన్సిక్ పరీక్షలు, జియో లోకేషన్ విశ్లేషణ, ఆర్థిక లావాదేవీల పరిశీలన వంటి శాస్త్రీయ ఆధారాలతో నిందితుల మధ్య ఉన్న సంబంధాలను గుర్తించినట్లు ఎన్ఐఏ వెల్లడించింది. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేసింది.

ఫ్లాట్ అప్పగింతలో జాప్యానికి పరిహారం కోరే హక్కు

సుప్రీం కోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ,జూన్ 27: గృహ కొనుగోలుదారుల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఫ్లాట్ నిర్మాణంలో జాప్యం జరిగినప్పుడు, దానిని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బిల్డర్ నుంచి నష్టపరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని స్పష్టం చేసింది. కేవలం ఫ్లాట్‌ను స్వీకరించినంత మాత్రాన, ఆలస్యానికి సంబంధించిన నష్టపరిహారం పొందే హక్కు రద్దు కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసును పునర్విచారణకు స్వీకరించింది.

నిర్మాణ జాప్యానికి సంబంధించిన నష్టపరిహారం అనేది ఫ్లాట్ అప్పగించడానికి ముందు కాలానికి వర్తిస్తుంది. కేవలం ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన, ఆ జాప్యానికి పరిహారం కోరే హక్కును కొనుగోలుదారులు కోల్పోరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీకి చెందిన టికెఎ పద్మనాభన్ అనే వ్యక్తి, అభియాన్ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీపై 2005లో దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. ఫ్లాట్ అప్పగింతలో తీవ్ర జాప్యం జరిగిందని ఆయన వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. ఒప్పందంలోని ఆర్బిట్రేషన్ క్లాజ్‌ను ప్రాతిపదికగా తీసుకుని కింది కోర్టులు ఈ కేసును మధ్యవర్తిత్వానికి పంపాయి. ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వినియోగదారుల రక్షణ చట్టం1986 అనేది ప్రైవేట్ ఆర్బిట్రేషన్ నిబంధనలకు అతీతంగా వినియోగదారులకు అదనపు రక్షణ కల్పిస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసును ఏడాదిలోగా పరిష్కరించాలని ద్వారక జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

కుటుంబాన్ని ఎదుర్కోవడం కంటే హత్యే సులువనిపించింది

పూణె హత్యకేసు సియాగోయల్ సంచలన వాంగ్మూలం

పూణె, జూన్ 27: మహారాష్ట్రలోని పుణెలో సంచలనం సృష్టించిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితురాలు సియా గోయల్ పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెల్లడించినట్లు సమాచారం. తనకు నిశ్చయమైన పెళ్లిని రద్దు చేసుకోవడం కోసం కుటుంబ సభ్యులను ఎదుర్కోవడం కంటే కాబోయే భర్త కేతన్ అగర్వాల్‌ను హత్య చేయడం సులభంగా అనిపించిందని సియా గోయల్ విచారణలో అంగీకరించినట్లు పుణె గ్రామీణ పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యుల మనోభావాలను దెబ్బతీయకూడదనే ఉద్దేశంతోనే పెళ్లి రద్దు చేయకుండా హత్యకు పాల్పడినట్లు ఆమె చెప్పినట్లు సమాచారం. ఈనెల 18న లోహగడ్ కోట వద్ద ఉన్న కొండచరియపై నుంచి కేతన్ అగర్వాల్‌ను తోసివేసి హత్య చేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ హత్యను సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి పథకంప్రకారం అమలు చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సియా గోయల్ తల్లిదండ్రులను లోనావాలా సిటీ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఆమె సోదరుడు సాహిల్ గోయల్‌ను కూడా రెండోసారి ప్రశ్నిస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు సియా గోయల్, చేతన్ చౌదరి మధ్య రెండువేలకు పైగా ఫోన్ కాల్స్ జరిగినట్లు, మొత్తం 238 గంటలకు పైగా వారు మాట్లాడుకున్నట్లు కాల్ రికార్డులు వెల్లడిస్తున్నాయని పోలీసులు చెపుతున్నారు. అయితే చేతన్ చౌదరిని తాము ఎప్పుడూ కలవలేదని, మాట్లాడలేదని సియా గోయల్ తల్లిదండ్రులు చెబుతున్నారు. మరోవైపు చేతన్ చౌదరి కేవలం సియా గోయల్ స్నేహితుడేనని ఆమె తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఇద్దరి మొబైల్ ఫోన్లలో డిలీట్ చేసిన డేటాను రికవరీ చేసి హత్యకు సంబంధించిన కుట్రను నిరూపించే ఆధారాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు.

మహిళా విభాగంపై అన్నాడిఎంకె ఫోకస్

జూలై 1న కీలక సమావేశం

చెన్నై, జూన్ 27: అసెంబ్లీ ఉపఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షమైన ఏఐఏడీఎంకే సంస్థాగతంగా వేగంగా కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్టీ మహిళా విభాగం కీలక సమావేశాన్ని జూలై 1న చెన్నైలోని రాయపేట్టా పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనుంది. ఈ సమావేశానికి పార్టీ ప్రధాన కార్యదర్శి కె.పళనిస్వామి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతం, గ్రామీణ స్థాయిలో మహిళా విభాగాన్ని మరింత చురుకుగా తీర్చిదిద్దడం, మహిళల రాజకీయభాగ స్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం పదాధికారులు, అన్ని సంస్థాగత జిల్లాల మహిళా విభాగ కార్యదర్శులు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. సమావేశానికి ఆహ్వానించబడిన వారందరూ తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ నాయకత్వం ఆదేశించింది. మహిళావిభాగం పని తీరును సమీక్షించడంతో పాటు పార్టీకి మరింత ప్రజా మద్దతు సమీకరించేలా మహిళావిభాగాన్ని ఎలా బలోపేతం చేయాలనే అంశంపై చర్చలు జరగనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సెమీక్రయోజెనిక్ ఇంజిన్ హాట్‌టెస్ట్ విజయవంతం

ఇస్రో ప్రయోగాల్లో మరో కీలక ఘట్టం

చెన్నై, జూన్ 27: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో దేశీయంగా అభివృద్ధి చేస్తున్న సెమీక్రయోజెనిక్ ఇంజిన్‌లో కీలకమైన పవర్ హెడ్ టెస్ట్ ఆర్టికల్ హాట్ టెస్ట్‌ను 175 టన్నుల థ్రస్ట్ స్థాయిలో విజయవంతంగా పూర్తి చేసింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఇటీవల ఈ పరీక్ష నిర్వహించారు. పవర్ హెడ్ టెస్ట్ ఆర్టికల్‌తో నిర్వహించిన హాట్ టెస్ట్‌ల శ్రేణిలో ఇది ఎనిమిదో పరీక్ష. థ్రస్ట్ చాంబర్ మినహా ఇంజిన్‌లోని అన్ని ప్రధాన వ్యవస్థలను ఇందులో అమర్చారు. ఈ తాజా పరీక్షలో ప్రీబర్నర్ ఇగ్నిషన్ తర్వాత ఇంజిన్ పనితీరు ఎలా ఉంటుందో పరిశీలించడంతో పాటు, అధిక థ్రస్ట్ వద్ద స్థిరంగా పనిచేసే సామర్థ్యాన్ని పరీక్షించారు. మొట్టమొదటిసారిగా ఈ ఇంజిన్ పవర్ హెడ్‌ను 175 టన్నుల థ్రస్ట్, అంటే పూర్తి సామర్థంలో 88 శాతం స్థాయిలో విజయవంతంగా నడిపారు. అంతకుముందు 94 టన్నులు, 120 టన్నుల థ్రస్ట్ స్థాయిల్లో కూడా పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. తాజా పరీక్షలో ప్రధాన టర్బో పంపులు కూడా అంచనాలకు అనుగుణంగా పనిచేశాయని ఇస్రో వెల్లడించింది. 400 బార్, 500 బార్ అవుట్‌లెట్ ఒత్తిడిని అవి విజయవంతంగా అందించాయి. పరీక్ష మొత్తం ముందుగా అంచనా వేసిన విధంగానే సాగిందని, అన్ని ఇంజిన్ పారామీటర్లు నిర్దేశిత పరిధిలోనే ఉన్నాయని ఇస్రో తెలిపింది. దీంతో పూర్తి సామర్థ్యమైన 200 టన్నుల థ్రస్ట్ వద్ద ఇంజిన్ పరీక్షలు నిర్వహించేందుకు విశ్వాసం పెరిగిందని పేర్కొంది. ఈ సెమీక్రయోజెనిక్ ప్రొపల్షన్ స్టేజ్‌ను ఎస్‌సీ120 పేరుతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో ఎస్ఇ2000 ఇంజిన్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌వీఎం3 రాకెట్‌లో ఉన్న ఎల్110 లిక్విడ్ కోర్ స్టేజ్‌కు బదులుగా దీన్ని అమర్చనున్నారు. కొత్త ఇంజిన్‌తో రాకెట్ మరింత బరువైన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే సామర్థ్యాన్ని పొందనుంది. పనితీరు, ఇంధన సామర్థం కూడా మెరుగుపడనుంది. ఈ ఇంజిన్‌లో లిక్విడ్ ఆక్సిజన్ (ఎల్ఓఎక్స్), శుద్ధి చేసిన కిరోసిన్ అయిన ఇస్రోసిన్ ఇంధనాలుగా ఉపయోగిస్తారు. ఇవి పర్యావరణహితమైనవి, విషపూరితం కానివని ఇస్రో తెలిపింది. ఈ కొత్త సెమీక్రయోజెనిక్ దశను అప్‌గ్రేడ్ చేసిన క్రయోజెనిక్ ఎగువ దశతో అనుసంధానిస్తే, భవిష్యత్తులో భారీ ఉపగ్రహాల ప్రయోగాలు, సుదూర అంతరిక్ష యాత్రలు, అలాగే భారత మానవ అంతరిక్ష కార్యక్రమం గగన్‌యాన్ వంటి మిషన్లకు మరింత బలాన్ని చేకూరుస్తుందని ఇస్రో వెల్లడించింది.

ఆ తండ్రి గుండె మళ్లీ కొట్టుకుంది

వెనెజులా విలయంలో 18 రోజుల మృత్యుంజయురాలు

కారకాస్, జూన్ 27: కొన్ని సెకన్ల విలయం ఎన్నో కుటుంబాల భవిష్యత్తును చిదిమేసింది. అదే సమయంలో.. ఓ కన్నతండ్రి గుండె మాత్రం మళ్లీ కొట్టుకుంది. తల్లి కౌగిలి లేకపోతే క్షణం ఉండలేని పసికందు.. శిథిలాల అడుగున పడిపోయింది, చివరకు సజీవంగా కనిపించి.. వెనుజులా పెనువిపత్తులో మృత్యువును జయించింది. వెనుజులాలో బుధవారం సాయంత్రం క్షణాలవ్యవధిలో జంట భూకంపాలు రావడంతో వందల భవనాలు కుప్పకూలాయి. దాంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఓ ప్రాంతంలో 18 రోజుల పసికందు తల్లితో సహా శిథిలాల కింద చిక్కుకుపోయింది. తన భార్యబిడ్డ అసలు బతికున్నారో లేదో తెలియక వారి కోసం వెతుకుతూ తండ్రి తల్లడిల్లాడు. అక్కడ రెస్క్యూ సిబ్బంది ఒక్కో సిమెంట్ దిబ్బను తొలగిస్తుంటే.. ఆ తండ్రి గుండె వేగంగా కొట్టుకోసాగింది. చివరకు ప్రయత్నం ఫలించి రోజుల బిడ్డ ప్రాణాలతో కనిపించింది. ఆ బిడ్డను వస్త్రంలో చుట్టి ఎంతో అపురూపంగా తండ్రికి అందించడంతో ఆయన గుండె మళ్లీ కొట్టుకున్నట్టయింది. చిన్నగాయం కూడా లేకుండా పాల కోసం ఎదురుచూస్తున్న ఆ బిడ్డను చూసి ప్రతి ఒక్కరి ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయి. ఒకవైపు బిడ్డ దొరికిందన్న ఆనందం.. మరోవైపు భార్య పరిస్థితి ఎలా ఉందో తెలియని పరిస్థితి. చివరకు 90 నిమిషాల తర్వాత ఆ తల్లి కూడా సజీవంగా ఉందన్న వార్త వినిపించింది. దాంతో అతడు ఊపిరి పీల్చుకున్నాడు. ఈ భారీ విపత్తు నుంచి ఆ కుటుంబం బయటపడిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

డిఎంకెకు గుడ్‌బై చెప్పిన ఎండిఎంకె

టివికె కూటమిలో చేరే అవకాశం

చెన్నై,జూన్ 27: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తొమ్మిదేళ్లుగా డిఎంకెతో కొనసాగుతున్న బంధాన్ని ఎండిఎంకె అధికారికంగా తెంచుకుంటున్నట్లు పార్టీ సర్వసభ్య సమావేశంలో శనివారం ఏకగ్రీవంగా నిర్ణయించారు. టివికె నేతృత్వంలోని కూటమిలో చేరుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయనప్పటికీ, ఆ దిశగానే సంకేతాలు ఇచ్చింది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అభినందిస్తూ ఎండిఎంకె తీర్మానాలు చేసింది. అవినీతి రహిత పాలన, మేఘదాతు డ్యామ్ వంటి అంశాల్లో తమిళనాడు హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాజీలేని వైఖరిని కొనసాగించాలని కోరింది. టివికె కూటమిలో చేరికపై ప్రత్యక్ష ప్రస్తావన లేనప్పటికీ, ఇటీవలి పరిణామాలు ఆ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. డిఎంకే కూటమిలో కొనసాగలేని పరిస్థితులు ఉన్నాయని ఎండిఎంకె ఆరోపించింది. తమ పార్టీని బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరిగాయని, ఎఐఎడిఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రహస్య ప్రణాళికలు రచించారని ఎండిఎంకె తన తీర్మానంలో ఆరోపించింది. అందుకే కూటమి నుంచి వైదొలగాల్సి వచ్చిందని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను డిఎంకే ఖండించింది. ఎండిఎంకెకు అసెంబ్లీ, పార్లమెంటులో ప్రాతినిధ్యం లభించేలా చేసింది డిఎంకేనే అని పార్టీ నేత సయ్యద్ హఫీజుల్లా అన్నారు. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన వైకో, ఇప్పుడు తన కుమారుడు దురై వైకోకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడమే ఎండిఎంకె బలహీనపడటానికి కారణమని ఆయన విమర్శించారు. ఎండిఎంకెకు కూడా ఎదురుదెబ్బ తగిలింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకె ఉదయిస్తున్న సూర్యుడు గుర్తుపై గెలిచిన ఇద్దరు ఎండిఎంకె ఎమ్మెల్యేలు, పార్టీ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. తాము డిఎంకెతోనే కొనసాగుతామని వారు స్పష్టం చేశారు. దీంతో ఎండిఎంకె అధికారికంగా టివికెతో కలిసినా, ప్రభుత్వ బలం తక్షణమే పెరగదు. ఉప ఎన్నికలకు ఆస్కారం కూడా ఉండదు. టివికె ప్రభుత్వం ఎదుర్కొన్న విశ్వాస పరీక్ష సమయంలో ఎండిఎంకె ఓటింగ్‌కు దూరంగా ఉండటంతోనే ఈ మార్పులకు పునాది పడింది. అనంతరం వైకో, దురై వైకోలు ముఖ్యమంత్రి విజయ్‌తో పాటు టివికె సీనియర్ నేతలతో సమావేశమయ్యారు.

ప్రస్తుతం టివికె కూటమిలో ఎండిఎంకెకూడా చేరే అవకాశాలున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌కు రెండు, విసికె, ఐయూఎంఎల్‌లకు ఒక్కో మంత్రి పదవి లభించగా, సిపిఐ, సిపిఎంలు టివికె ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్నాయి. మరోవైపు భవిష్యత్తులో ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలనే వాదన డిఎంకెలో బలపడుతోంది. డిఎంకె ఎంపి కనిమొళి ఈ ప్రతిపాదనను ముందుకు తేగా, కేంద్ర మాజీ మంత్రి, ఎంపి ఎ. రాజా కూడా దీనిని సమర్థించారు. ఒకప్పుడు డిఎంకె అధినేత కరుణానిధికి రాజకీయ శిష్యుడిగా పేరుగాంచిన వైకో, 1993లో పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అప్పటి నుంచి డీఎంకేతో ఆయన బంధం ఒకసారి కలిసి, మరోసారి విడిపోతూ వస్తోంది. తాజా నిర్ణయంతో ఆయన మరోసారి డీఎంకే కూటమి నుంచి వైదొలిగారు.

డిజిటల్ సేవలపై పన్నులువేస్తే 100% సుంకాలు తప్పవు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్,జూన్ 27: అమెరికా టెక్నాలజీ సంస్థలను లక్ష్యంగా చేసుకుని డిజిటల్ సేవల పన్ను (డీఎస్‌టీ) విధించే దేశాలపై యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయా దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై 100 శాతం ప్రతీకార సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా-యూరప్ దేశాల మధ్య సరికొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసేలా కనిపిస్తోంది. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ అమెరికా కంపెనీలపై డిజిటల్ సేవల పన్ను విధించే లేదా అమలు చేయడానికి సిద్ధపడే ఏ దేశమైనా సరే, తక్షణమే అమెరికా నుంచి తీవ్రమైన ఆర్థిక పర్యవసానాలను ఎదుర్కోవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ 100 శాతం టారిఫ్ సదరు దేశాలతో కుదుర్చుకున్న పాత, కొత్త వాణిజ్య ఒప్పందాలన్నింటినీ అధిగమించి వర్తిస్తుందని ఆయన రాసుకొచ్చారు. అమెరికా కంపెనీల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఏ దేశం అడుగులు వేసినా ఈ సుంకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఈ వివాదం ప్రధానంగా ఆపిల్, అమెజాన్, మెటా, గూగుల్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజాల చుట్టూ తిరుగుతోంది. అనేక యూరోపియన్ దేశాలు ఈ కంపెనీలు తమ స్థానిక మార్కెట్ల నుంచి ఆర్జిస్తున్న ఆదాయంపై డిజిటల్ సేవల పన్నులను విధిస్తున్నాయి లేదా పెంచాలని యోచిస్తున్నాయి.

ఈ పన్నులు ఉద్దేశపూర్వకంగానే అమెరికా కంపెనీలను వివక్షకు గురిచేసేలా ఉన్నాయని వాషింగ్టన్ సుదీర్ఘకాలంగా వాదిస్తోంది. ముఖ్యంగా ఫ్రాన్స్ దేశం 2019 నుంచి 3 శాతం డిజిటల్ సేవల పన్నును అమలు చేస్తూ తాజాగా 6 శాతానికి పెంచే ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ గతంలో మాట్లాడుతూ అమెరికా ఒత్తిళ్లకు లొంగి తాము ఈ పన్నును వెనక్కి తీసుకోబోమని తేల్చి చెప్పారు. బ్రిటన్, స్పెయిన్, ఆస్ట్రియా వంటి దేశాలు కూడా ఇటువంటి పన్ను విధానాలను కలిగి ఉండటంతో ట్రంప్ తాజా ప్రకటన ఈ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. అమెరికా ఒకవేళ నిజంగానే 100 శాతం టారిఫ్‌లను విధిస్తే, అది అంతర్జాతీయ సరఫరా గొలుసులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. యూరప్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వైన్, చీజ్, కార్లు, యంత్రాల వంటి ప్రసిద్ధ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగిపోయి, ఇరువైపులా ఉన్న వినియోగదారులు, వ్యాపారాలపై మోయలేని భారం పడుతుంది.

సంక్షిప్త వార్తలు

త్వరలో భారత్ పర్యటనకు ట్రంప్

వాషింగ్టన్, జూన్ 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు. వచ్చే యేడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. భారత్-అమెరికామధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడిపర్యటనకు సంబంధించిన ఏర్పాటు ఖరారు చేయడానికి ఈ యేడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని మార్కో రూబియో తెలిపారు.

సూడాన్‌లో అంతర్యుద్ధం.. పలు సంస్థలపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్, జూన్ 27: ఒక భారతీయ కంపెనీసహా పలు సంస్థలు, ఎనిమిది మంది వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. సుడాన్‌లో అంతర్యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖకు చెందిన ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ వెల్లడించింది. సూడాన్ సాయుధ దళాలు , రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య ఘర్షణ తీవ్రతరం కావడానికి ఈ సంస్థలు కారణమవుతున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా ఈ రెండు దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణ లతో సూడాన్‌లో అంతర్యుద్ధం నడుస్తోంది. దాంతో ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభం ఏర్పడింది.

పాక్‌లో భూకంపం

కరాచి,జూన్ 27: పాకిస్థాన్‌లో ఇవాళ మళ్లీ భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.4గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించింది. గంటల వ్యవధిలోనే దేశంలో భూకంపం రావడం ఇది రెండోసారి. నిన్న సాయంత్రం కూడా 5.3 తీవ్రతతో భూమి కంపించింది. అయితే, ఈ రెండు ఘటనల్లోనూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సమాచారం. భారత, యురేషియా టెక్టోనిక్ ప్లేట్ల సరిహద్దులో ఉండటంతో పాకిస్థాన్‌లో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. ఇదిలా ఉంటే వెనెజులాలో సంభవించిన భూకంప విలయం పెను విషాదాన్ని మిగిల్చింది. రెండు రోజుల క్రితం 7.2, 7.5 తీవ్రతతో వచ్చిన భారీ జంట భూకంపాల తర్వాత నిన్న మరోసారి 4.9 తీవ్రతతో భూమి కంపించింది. ఈ ప్రకృతి వైపరీత్యం ధాటికి మృతుల సంఖ్య 920కి చేరినట్లు అధికారులు ధ్రువీకరించారు.

ఖేర్వాగడ్ వంశ తొలి వారసురాలిగా 13 యేళ్ల బాలిక



జైపూర్,జూన్ 27: శతాబ్దాల కాలంగా వస్తున్న కట్టుబాట్లను, పురుషాధిక్య రాజకుటుంబ సంప్రదాయాలను పక్కన పెడుతూ రాజస్థాన్ చరిత్రలో ఒక అద్భుతమైన సామాజిక మార్పు చోటుచేసుకుంది. రాజ్‌పుత్ సంప్రదాయాల ప్రకారం కేవలం మగవారికే పరిమితమైన చారిత్రాత్మక పాగ్ కా దస్తూర్ అంటే తలపాగా చుట్టే వేడుకను 13 ఏళ్ల బాలికకు నిర్వహించారు. పాలి జిల్లాలోని ఖేర్వాగఢ్ వంశానికి మొదటి మహిళా వారసురాలిగా తేజస్వి కుమారి జోధా అధికారికంగా బాధ్యతలు స్వీకరించి సరికొత్త రికార్డు సృష్టించింది. పాలి జిల్లాలోని చారిత్రాత్మక ఖేర్వా కోటలో వందల మంది గ్రామస్థులు, సంఘ పెద్దల సమక్షంలో ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది.

ఐపిఎల్‌మ్యాచ్‌లో టివికె మంత్రిపై డ్రగ్స్ ఆరోపణలు

చెన్నై,జూన్ 27: తమిళనాడులోని టివికె మంత్రి డ్రగ్స్ తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఐపిఎల్ సమయంలో స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నప్పుడు ఆయనకు సంబంధించిన ఒక వీడియో వైరల్ కాగా ఈ ఆరోపణలను ఆ మంత్రి ఖండించారు. మాదకద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని, క్రీడలను స్వీకరించాలని ముఖ్యమంత్రి విజయ్ కోరారు. శుక్రవారం డ్రగ్స్ వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. టివికె ప్రభుత్వానికి చెందిన మానవ వనరుల శాఖ మంత్రి డీ శరత్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి శరత్ కుమార్‌కు సంబంధించిన పాత వీడియో క్లిప్ వెలుగులోకి వచ్చింది.

స్విమ్స్‌లో కృత్రిమ మేధతో వైద్య విద్య సేవల్లో విప్లవాత్మక మార్పులపై ప్రత్యేక వర్క్ షాప్

తిరుపతి హెల్త్ 27, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ నందు కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్స్ (ఏ.ఐ) వైద్య విద్యను బోధించే విధానాన్ని వైద్య నిర్ణయాలకు మద్దతు అందించే ప్రక్రియను, అలాగే ఆరోగ్య సంరక్షణ సేవల నిర్వహణను వేగంగా రూపాంతరం చెందిస్తున్న నేపథ్యంలో, ఈ రంగంలో తాజా పరిణామాలను వైద్య విద్యావేత్తలు, వైద్యులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులతో పంచుకోవడానికి శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) తిరుపతి 1 వర్క్ ఎ.ఐ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్ షాప్‌ను శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్, డీన్ డా. అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్. బిట్లా, మెడిసిన్ విభాగాధిపతి సీనియర్ గ్రేడ్ ప్రొ డా. అల్లాడి మోహన్, అతిధి వక్తలు సహ వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఓరుగంటి అరవింద్, జి. మంజునాథ్, అల్లాడి వి. శ్రీకుమార్, ఐ.టి.యస్, ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్, బి.యస్.యన్.యల్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సుధారాణి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా. ఉమామహేశ్వరి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఈ వర్క్ షాప్‌కు 1 వర్క్ సంస్థ సహకారం అందిస్తోంది. మానవ నైపుణ్యాలు, కృత్రిమ మేధ ఏ.ఐ ఆధారిత పని విధానాల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ, గుర్తింపు, సామర్థ్యాభివృద్ధి, సమర్ధవంతమైన అమలును అనుసంధానించే వినూత్న వేదికగా 1 వర్క్ సేవలందిస్తోందన్నారు. ఈ వర్క్ షాప్ లో ఏ.ఐ ఆధారిత వైద్య విద్య క్లినికల్ డిసిషన్ సపోర్ట్ సిస్టమ్స్ ఆరోగ్య సంరక్షణ నిర్వహణలో ఏఐ వినియోగం, వైద్య పరిశోధనలో ఆధునిక సాంకేతికత, నైతిక అంశాలు మరియు భవిష్యత్ అవకాశాలపై ప్రముఖ నిపుణులు ప్రసంగించారు. పాల్గొనే అధ్యాపకులు, వైద్యులు, పరిశోధకులు మరియు విద్యార్థులు ఏ.ఐ ఆధారిత వైద్య రంగంలోని తాజా ధోరణులు, వినియోగాలు మరియు సవాళ్లపై సమగ్ర అవగాహన పొందే అవకాశం కలుగుతుందని డా. ఆర్.వి. కుమార్ పేర్కొన్నారు. వైద్య విద్యా వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంతో పాటు, నాణ్యమైన ఆరోగ్య సేవల అందించడంలో కృత్రిమ మేధ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ వర్క్ షాప్ దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్విమ్స్ నెట్ వర్క్ ఇంజనీర్ ప్రణయ్ తేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.యం.ఓ డా. కోటిరెడ్డి, డా. సతీష్, డిప్యూటీ రిజిస్ట్రార్ డా. యర్రంరెడ్డి, డా. శివరామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ స్పెషల్ క్యాంపెయిన్‌లో ఎన్యూమరేషన్ ఫారాల పరిశీలన

– ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు చేయాలి – తహసీల్దార్ శ్రీదేవి

యర్రావారిపాలెం, జూన్ 27, ప్రభాతవార్త

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ స్పెషల్ క్యాం పెయిన్ కార్యక్రమంలో భాగంగా యర్రావా రిపాలెం మండలంలోని కోటకాడపల్లి పంచాయతీ పరిధిలోని చెంగాడివాండ్లపల్లి గ్రామంలో పోలింగ్ స్టేషన్ నంబర్4 పరిది లో తహసీల్దార్ శ్రీదేవి ఎన్యూమరేషన్ ఫారాల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసినట్లు తెలిపారు. ఓటర్లు ఫారంలో అవసరమైన వివరాలను పూర్తిగా, స్పష్టంగా నమోదు చేసి, ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజు ఫోటోను అతికించి, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) ఇంటికి వచ్చినప్పుడు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. అదేవిధంగా, కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అలాగే చనిపోయిన వారి పేర్లు, వివాహం కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు, శాశ్వతంగా వేరే ప్రాంతానికి నివాసం మార్చుకున్న వారి వివరాలు, రెండు చోట్ల ఓటు నమోదై ఉన్న వారి సమాచారాన్ని సంబంధిత బీఎల్ఓ కు తప్పనిసరిగా తెలియజేయాలని కోరారు. ఎన్నికల జాబితా పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ స్పెషల్ క్యాంపెయిన్ ను మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొని పూర్తి సహకారం అందించాలని కోరారు.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు

– ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ అధికారుల చర్యలు

వరదయ్యపాలెం, జూన్ 27, ప్రభాతవార్త

ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు వరదయ్యపాలెం మండల రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. తహశీల్దార్ శివరాం సుబ్బయ్య ఆదేశాల మేరకు కదూరు క్రాస్ పరిసర ప్రాంతంలోని సర్వే నంబర్లు 452, 463లో ఆక్రమణల నివారణ తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వ భూమి అని ప్రజలకు తెలియజేసే విధంగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠినచర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజలు ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా సహకరించాలని, ఎవరైనా ఆక్రమణ ఆక్రమణలకు పాల్పడితే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రజనీకుమార్ (రవి రెడ్డి), సర్వేయర్ అనిల్‌కుమార్, రాఘవ, వీఆర్ఏచలపతి, తులకాణం, సుబ్రహ్మణ్యంతదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌కు రూ.10,00,116 విరాళం

తిరుపతి హెల్త్, జూన్ 27, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి స్విమ్స్ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి చెన్నై నగరానికి చెందిన రేయిన్ బో ఫౌండేషన్ లిమిటెడ్ సంస్థ అధినేత నితీష్ కోరిక మేరకు స్విమ్స్ హాస్పిటల్ పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకొని ఈ విరాళం అందించినట్లు తెలిపారు. దాత తరపున తిరుపతి వాస్తవ్యులు వై. రాఘవేంద్ర చేతుల మీదుగా 10,00,116 (పది లక్షల నూట పదహారు రూపాయలు) విరాళాన్ని డి.డి. రూపంలో శనివారం సాయంత్రం 4 గంటలకు స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచా లకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్‌కి అందజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ విరాళ దాత రేయిన్ బో ఫౌండేషన్ లిమిటెడ్ సంస్థ అధినేత నితీష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, ఇచ్చిన విరాళాన్ని పేద రోగుల వైద్య సేవలకు ఉపయోగిస్తామని తెలియజేశారు.

చంద్రగిరి ఎమ్మెల్యే నానిపై

బిజెపి నేత చేసిన ఆరోపణలపై బిజెపి స్పష్టీకరణ

తిరుపతిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై బిజెపి నేతగా చెప్పుకుంటున్న మేడసాని పురుషోత్తమనాయుడు చేసిన అవినీతి ఆరోపణలపై బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. మేడసాని పురుషోత్తమ నాయుడు ప్రస్తుతం బిజెపిలో ఎలాంటి అధికారిక బాధ్యతలు నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. తాను చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పేర్కొనడం కూడా పూర్తిగా తప్పుడు ప్రచారమని తెలిపారు. పురుషోత్తమనాయుడు వ్యక్తిగతంగా చేస్తున్న కాంట్రాక్ట్ పనులు, అలాగే ఆయన చేస్తున్న అవినీతి ఆరోపణలకు బిజెపి పార్టీకి ఎటువంటి సంబంధం లేదని శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీ పేరును ఉపయోగించి వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించడం తగదని హెచ్చరించారు. బిజెపి పార్టీకి చెందిన అధికారిక ప్రతినిధులు మాత్రమే పార్టీ తరపున మాట్లాడగలరని, ఇతరుల వ్యాఖ్యలను పార్టీ అభిప్రాయాలుగా పరిగణించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోఫణలు రాజకీయ వాతావరణంలో చర్చనీయాంశంగా మారగా, బిజెపి జిల్లా నాయకత్వం ఇచ్చిన ఈ స్పష్టీకరణకు ప్రాధాన్యత ఏర్పడింది.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలతో తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిధ్యాలు,భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు దేవేరులతో తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఇఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ ఆనంబట్టు ధనశేఖర్, అర్చకులు ఆంజనేయాచార్యులు, పరిచారిక ఘనాపాటి తిరువేంగడం, ఓఎస్‌డబ్ల్యు మూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజంగా నిలుపుదాం

– డాక్టర్ ప్రియాంక

పూతలపట్టు, జూన్ 27, ప్రభాతవార్త

పోలియో ఆదివారం రేపే అపుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల వరకు పిల్లలందరికి రెండు పోలియో చుక్కలు వేయించి మీ బిడ్డలను పోలియో మహమ్మారి నుండి కాపాడుకొందాం అని నినాదాలు సేస్తు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీసేస్తు లైబ్రరీ సర్కెల్ నందు మానవహారం సేసి పోలియో చుక్కలు తప్పక వేయించండి పోలియో నుండి మీ బిడ్డలను కాపాడుకోండి పోలియో ఆదివారం తప్పక వేయించండి అనే నినాదాలతో ర్యాలీ చేశారు. పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 22 పోలియో బూత్ ఏర్పాటు సేశామని ఒక్కో బూత్‌లో 4 ఉంటారని ప్రతి ఒక బిడ్డకు పోలియో చుక్కలు వేస్తారని రెండు రూట్ ఇద్దరు సూపర్ వైజర్స్ అలాట్ చేశామని బస్టాండ్‌లో ట్రాన్సిట్ సెంటర్ ఏర్పాటు చేశామని ఒక మొబైల్ టీం కూడా ఉంటదని ఎక్కడ ఒక బిడ్డ కూడా తప్పిపోకుండా పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. 29,30 తేదీలలో ఇల్లు ఇల్లు తిరిగి ఎవరైనా తప్పిపోయిన వారికీ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మినారాయణ ఎంపిహెచ్ఈఓ, నరసింహ ప్రసాద్, సూపర్ వైజర్స్ నూర్జాహన్, ధర్మేంద్ర ఎంఎల్‌హెచ్‌పిఓస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పులిచెర్ల, జూన్ 27, ప్రభాతవార్త

చిన్నారులు అంగవైకల్యం బారిన పడ కుండా వారి నిండు జీవితం చక్కగా ఉం డాలంటే రెండు పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 28 వతేది ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ఆయన ఆధ్వర్యాన ఆరోగ్య సిబ్బంది పులిచెర్ల గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 1465 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ధేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్యసాధనకై మొత్తం 9 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, అంతేకాకుండా మొబైల్ టీమ్ ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. తల్లిదండ్రులు ఆదివారం పోలియో కేంద్రాలకు వచ్చి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అపర్ణ, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, సూపర్ వైజర్లు ప్రమీల, పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాచపల్లి శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో విశేష పూజలు

పులిచెర్ల, జూన్ 27, ప్రభాతవార్త

మండలంలోని దేవళంపేట పంచాయతీ. మిట్ట మీద రాచపల్లి శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం రామనామంతో ఆలయం మారుమోగింది. ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్న ప్రసాద వితరణ జరిపారు. ఆలయ పర్యవేక్షకులు రమేష్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తుల ఏర్పాట్లు పరిశీలించారు. పెద్ద ఎత్తైన భక్తులు స్వామివారిని దర్శించుకుని శ్రీ రామ జయ రామ జయ జయ రామ అంటూ భక్తి గీతాలు ఆలపించారు.

జాతీయ స్థాయిలో ఉత్తమ వ్యవసాయ వర్శిటీ గా తీర్చిదిద్దడమే లక్ష్యం

తిరుపతి విద్య జూన్ 27 ప్రభాత వార్త

ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ ,
తిరుపతిలో రూ.5.5 కోట్ల ఆలమ్‌నీ హోమ్ ప్రారంభం.
విద్య, పరిశోధన, విస్తరణ రంగాల్లో సమగ్ర సంస్కరణలు
బాలికల హాస్టల్, ఆడిటోరియం నిర్మాణానికి హామీ
సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతున్నామని విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ తెలిపారు. విద్య, పరిశోధన, విస్తరణ సేవల్లో నాణ్యతను మరింత పెంచుతూ రాబోయే ఐదేళ్లలో విశ్వవిద్యాలయాన్ని కొత్త శిఖరాలకు చేర్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.5.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆలమ్‌నీ హోమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన ఆయన, పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన ఈ అతిథి గృహం కళాశాల అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. పూర్వ విద్యార్థులు విద్యాసంస్థ అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల బాలికల వసతి గృహ నిర్మాణానికి సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తులో రూ.10 నుంచి రూ.12 కోట్ల వ్యయంతో ఆధునిక ఆడిటోరియం నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మౌలిక వసతులు విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తాయని ఆయన చెప్పారు.ప్రారంభోత్సవ కార్యక్రమాల అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఉపకులపతి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి ప్రాంతీయ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కమిటీల సూచనల ఆధారంగా వచ్చే ఐదేళ్లకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, విద్య, పరిశోధన, విస్తరణ సేవల్లో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తామని వివరించారు.వ్యవసాయ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ బయో రిసోర్సెస్‌పై విస్తృత పరిశోధనలు చేపడతామని తెలిపారు. పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఈ రంగాల్లో సర్టిఫికెట్ కోర్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల సరళిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. వివిధ పరిశోధన, విస్తరణ కేంద్రాల ద్వారా రైతులకు తగిన సాంకేతిక సూచనలు, శిక్షణ కార్యక్రమాలు నిరంతరం అందిస్తామని చెప్పారు.అనంతరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, రైతులతో కలిసి కళాశాల నుంచి చెర్లోపల్లి సెంటర్ వరకు మెగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమని ఉపకులపతి వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు, పరిశోధనా సంచాలకులు డాక్టర్ వి. సుమతి, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సంపత్ కుమార్, ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. హేమలత, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి. చంద్రిక, వర్సిటీ ఎస్టేట్ ఆఫీసర్ నర్సింగారావు, ఆలమ్ని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఐ. రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వి. నాయుడు తో పాటు పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు,విద్యావేత్తలు,బ్యాంకింగ్ రంగ నిపుణులు,అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

కన్నీటితో పీర్ల పండుగ

రేణిగుంట జూలై 27 ప్రభాతవార్త

రేణిగుంట పట్టణం నందు అత్యంత మహిమాన్వితుడుగా ప్రజలు నమ్ముతున్న మిరియాలు బాబా ఆశ్రమం (దర్గా)లో మొహరం పండుగ సందర్భంగా శనివారం షహదత్ కార్యక్రమాన్ని కన్నీటితో జరుపుకున్నారు. మొహరం నెల పదో రోజుని షహదాత్ నిర్వహించి ఆరోజు పీర్లను ప్రతిష్టిస్తారని గౌసియా ఆశ్రమ పీఠాధిపతి, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మయాహత్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఖ్వాజా జుబేర్ హయత్ ఆలీషా ఖాదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ధర్మస్థాపన కొరకు ప్రవక్త మహమ్మద్ మనుమడు హజరత్ హుస్సేన్ షాహిదీ తమ కుటుంబంతో కలిసి ప్రాణాలను బలిదానం చేసిన అతి పవిత్రమైన రోజు మొహరం అన్నారు. ఈ సందర్భంగా పేర్లను స్థాపించి పది రోజులు ఆయన కుటుంబానికి అశ్రునివాలు అర్పించిన అనంతరం పదవరోజు వాటిని జల్దిలో నిమజ్జనం చేస్తామన్నారు. మొహరం పండుగ హిందూ ముస్లిం కలయికకు గొప్ప నిదర్శనం అన్నారు. అందుకు నిదర్శనం గా వారం రోజులు నెల్లూరు దర్గామిట్ట వద్ద కుల మతాలకతీతంగా పెద్ద ఎత్తున రొట్టెల పండుగ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు రహమాన్ షరీఫ్, రేణిగుంట మండల అధ్యక్షుడు రైటర్ మహబూబ్బాషా, సత్తార్ ఖాదిరి, సుభాన్ ఖాదిరి, తిరుపతి జాఫర్, బాలాజీ, నందా,రహమాన్,జుబేర్‌హయాద్ ఖాదిరి సోదరులు కుటుంబ సభ్యులు షా తదితరులు పాల్గొన్నారు....

ఓటరు నమోదు జాబితా పదారక్షితంగా జరగాలి

– మండల అధ్యక్షుడు శివకుమార్

సత్యవేడు, జూన్ 27 ప్రభాతవార్త:

సత్యవేడు మండల శ్రీసిటీ పరిధిలో ఆరూర్ గ్రామ పంచాయతీలో సార్ కార్యక్రమాన్ని సత్యవేడు మండల అధ్యక్షుడు శివకుమార్ నాయుడు శనివారం పరిశీలించారు. అధిష్టానం ఆదేశాల మేరకు సార్ కార్యక్రమం పురోగతిని పరిశీలించి సత్యవేడు మండలంతెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పరుచూరి శివకుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కో–క్లస్టర్ తదితరులు ఆరూరు గ్రామంలోని 245వ పోలింగ్‌బూత్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ సార్ కార్యక్రమాన్ని బీఎల్‌వోలతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డేవిడ్, తులసి, బూత్ ఇన్‌చార్జి నాగరాజు, కార్తీక్, బీఎల్‌వో సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలి

విజయపురం, జూన్ 27 ప్రభాతవార్త:

దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపా ధ్యాయుడు వెంక మరాజు పేర్కొన్నారు. శనివారం విజయపురం మండలం శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు దాత దొమ్మరాజు శ్రీనివాసవర్మ తన తల్లిదండ్రులైన దొమ్మరాజు ధనలక్ష్మి,జయదేవరాజు జ్ఞాపకార్థం రాత పుస్తకాలు, పలకలు, బలపాలు, పెన్సిల్స్, పెన్నులు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసవర్మను విద్యా కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో దొమ్మరాజు చందన, జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు సురలక్ష్మి, సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎం అగరం మాజీ సర్పంచ్ చెంచు రామానాయుడు మృతి

విజయపురం, జూన్ 27 ప్రభాతవార్త:

మండలంలోని ఎం అగరం మాజీ సర్పంచ్ పెమ్మసాని చెంచు రామానాయుడు మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ చిన బాబు పూలమాల వేఇస నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌నాయుడు, అగరం రామకృష్ణ , సింగిల్‌విండో ఛైర్మన్ బాబునాయుడు, స్థానిక టీడీపీ నాయకులు మధు నాయుడు, గుణభూషణమ్మ, పెమ్మసాని, గిరి, నిత్య తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం మేజర్ పంచాయతీలో ఓటరు నమోదు : తహసీల్దార్

నాగలాపురం, జూన్ 27 ప్రభాతవార్త:

నాగలాపురం మండలంలోని మేజర్ పంచాయతీ పరిధిలో ఇంటింటా ఓటరు జాబితా ప్రత్యేకనమోదు సవరణ కార్యక్రమాన్ని మండల రెవెన్యూ అధికారి, తహసీల్దార్ రోజా రాణి శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చిరునామా సవరణ వంటి అంశాలను పరిశీలిస్తూ బీఎల్‌వోల పనితీరును ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్లు జాబితాలో నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వో నాగభూషణం, మండల పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, యూనిట్ ఇన్‌చార్జి సురుటుపల్లి ఆలయ పాలకమండలి సభ్యుడు నెల్సన్ మండేలా, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ కుమార్, వెంకటేష్, ఇతర నాయకులు, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మండలంలో పల్స్ పోలియోను విజయవంతం చేయండి

కేవీబీ పురం, జూన్ 27 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం జిల్లా మెడికల్ ఆఫీసర్ నాయక్, కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ఎల్.నాయక్ ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఎల్.రామ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఉన్న ఆశ వర్కర్లు, స్టాఫ్‌నర్సులతో పాటు అంగన్‌వాడీ టీచర్లకు దిశా నిరేద్శం చేయడం జరిగింది. ప్రైమరీ హెల్త్ సెంటర్ కింద మూడు రూట్లు వేములపూడి కొండల్ల ఆధవరం, కోటమంగాపురం, పూడి, సీకే పురం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ కింద 3150 మంది 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు గుర్తించామని ఏ ఒక్క పిల్లలని కూడా మిస్ చేయకుండా పోలియో చుక్కలు అందే విదంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రామ్‌నాయక్ మండల తహసీల్దార్, ఎంపీడీవో, అలాగే మండల విద్యాశాఖ అధికారులు సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రాజు, సూపర్‌వైజర్ జయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ తులసిరామ్, పార్మసిస్ సుబ్రహ్మణ్యం,స్టాఫ్ నర్సు పలువురు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శివాలయంలో నంది ప్రదోషం

పుత్తూరు రూరల్, జూన్ 27 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నంది ప్రదోషం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని కామాక్షి దేవికి శ్రీ సదాశివేశ్వర స్వామికి ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలకు కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం శివుని వాహనమైననందీశ్వరునికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి కామాక్షిదేవిని సదాశివేశ్వర స్వామిని నంది వాహనంపై ఆలయ ప్రదక్షిణం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి పూజలుచేశారు.

శ్రీకాళహస్తి డివిజన్

రేణిగుంట మండలం కొత్తకాల్వ వద్ద లోకేష్ సమావేశం ఖరారు!

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌రాక కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతుందని అలాగే అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు,రేణిగుంట మండలాల్లో సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి నాయకులతో సమీక్షించారు. అయితే అన్ని విధాలా రేణిగుంట మండలం కొత్త కాల్వ వద్ద ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా మండల నాయకులకు దిశ దేశ నిర్దేశం చేస్తూ జూలై 1న విద్యాశాఖ మంత్రి,పార్టీ జాతీయప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారి శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి వస్తున్నారన్నారు. ఆయన పర్యటనను వవిజయవంతం చేయాలన్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేసి శ్రీకాళహస్తి నియోజకర్గంలో పార్టీ పట్టుకు తిరుగులేదని నిరూపించాలని

సుధీర్‌రెడ్డి ద్వితీయ శ్రేణి నాయకులకు సూచించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి జూలై 1న వస్తున్న లోకేష్ అన్న కార్యక్రమాలకు పరిమితంగా అనుమతిస్తున్నట్లు వివరించారు. ఒక్కొక్క మండలం నుంచి కేవలం 250మందిని మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. శనివారం పరిశీలనల్లో ఎంఎల్ఏతో పాటు నాగరాజు నాయుడు, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,కృష్ణయాదవ్, బత్తలగిరి బాబు నాయుడు,చంద్రారెడ్డి,బాషా,కేశినేని సుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తొట్టంబేడు జూన్ 27 (ప్రభాతవార్త): ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో విజయవంతంగా కొనసాగించాలని తొట్టంబేడు ఎస్ఐఆర్ ఓటర్ నమోదుఅధికారిని తొట్టంబేడు మండల ఎన్నికల అధికారి భారతి. శనివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు, సూపర్వైజర్లు బీఎల్వోలు విజయవంతంగా ఎస్ఐఆర్ పూర్తి చేశామని తెలిపారు. ఎస్ఐఆర్ ఓటరు నమోదు అధికారిని భారతి మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు రెండు అందజేయా లని, ప్రతి ఓటరు తప్పనిసరిగా వాటిని నింపి తిరిగి ఒక ఫారం బీఎల్వోలకు అందజేయాలని సూచించారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను సక్రమంగా ఎన్యుమరేట్లకు అందించాలని విజ్ఞప్తి చేశారు. విదేశాలు, ఇతర నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, సైన్యంలో విధులు నిర్వహిస్తున్న ఓటర్లు కూడా ఆన్‌లైన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని, లేదా వారి కుటుంబ సభ్యులు సంబంధిత బీఎల్వోకు వివరాలు అందించవచ్చని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఓటరు పేరు లేకపోవడం, లేదా ఇతర అభ్యంతరాలపై ఆగస్టు 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. సూపర్వైజర్లు,ఎన్యుమరేషన్, త్వరితగతిన సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సందర్భంగా తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతు ఆదాయం పెంపు

- స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్

గుడిపాల, జూన్ 27 (ప్రభాతవార్త): ప్రకృతి వ్యవసాయ సాగుతో ప్రజలకు ఆరోగ్యం అందించడమే కాకుండా రైతులకు అధిక దిగుబడితో పాటు ఆదాయం పెరుగుతుందని స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని పల్లూరు గ్రామంలో శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ పర్యటించి ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పిఎండిఎస్ క్షేత్రాలను పరిశీలించారు. విత్తన గుళికలతో సాగు చేసిన పొలంలో మొలక శాతం అధికంగా వుండటం, మొక్కల పెరుగుదల సమానంగా వుండటం, నేలలో తేమ నిల్వ సామర్థ్యం మెరుగ్గా వుండటం వంటి ప్రయోజనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల్లో గ్రామంలోని రైతుల సమూహాలుగా ఏర్పడి పీఎండీఎస్‌తో పాటు ఇతర అంతర పంటలను సాగు చేయడం అభినందనీయమన్నారు. వర్షపాతం అనిశ్చితంగా వున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి పంటల సాగు ద్వారా రైతులు స్థిరమైన దిగుబడులు సాధించే అవకాశం వుంటుందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం హెచ్చుతగ్గులకు లోను అయ్యే అవకాశం వున్నందున రైతులు తమ పొలాలను బీడుగా వుంచకుండా ఏదో ఒక పంట లేదా అంతర పంటను తప్పనిసరిగా సాగు చేయాలని సూచించారు. సంవత్సరంలో 365 రోజుల పాటు భూమి పంటలతో కళకళలాడేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పిఎండిఎస్‌లో సాగు చేసే నవధాన్యాలతో కూడిన పంటలను పశువులకు మేతగా అందిస్తే వాటి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాల ఉత్పత్తి, రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు ఏదో ఒక పంట ద్వారా తప్పనిసరిగా ఆదాయం పొందేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ఇందుకు ప్రకృతి వ్యవసాయం ఉత్తమ మార్గమన్నారు. అనంతరం గుడిపాల మండల పరిధిలోని రైతులకు ఎన్ఎంఇఓ-ఓఎస్ పథకం కింద వంద శాతం రాయితీతో సోయాబీన్ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. అలాగే రైతులకు పీఎండీఎస్ కిట్లు, సాయిల్ హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీ, చిత్తూరు డివిజన్ ఎడి కె.శివశంకర్, డిఎడి ఎ.మురళీ, ఎడిఎ ఉమా, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ శిరీష, మండల వ్యవసాయ అధికారి సంగీత, ఇతర శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు పల్స్ పోలియో కార్యక్రమం

తిరుపతిరూరల్,జూన్ 27 (ప్రభాతవార్త): జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా ఆదివారం తిరుపతి జిల్లాలోని దుకాణాలు, సంస్థలు, తాత్కాలిక కార్మిక శిబిరాలు, నిర్మాణ పనులు జరిగే ప్రదేశాలు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, ఆక్వా యూనిట్లలో పనిచేసే కార్మికుల ఐదు సంవత్సరాలు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఉప కార్మిక కమీషనర్ ఎన్.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో బూత్‌లలో 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాల న్నారు. అలాగే చాంబర్ ఆఫ్ కామర్స్ పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపార సంఘాలు, బిల్డర్స్ అసోసియేషన్స్, గుత్తేదారులు, కార్మిక సంఘాలు తమ పరిధిలో పని చేసే కార్మికుల కుటుంబాలలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించి, వారి పిల్లలకు సమీప కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించేలా సహకారం అందించాలని కోరారు.

జాతీయ నృత్యపోటీల్లో బహుమతుల ప్రదానం

తిరుపతి, జూన్ 27(ప్రభాతవార్త): తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా జరుగుతున్న కృష్ణదేవరాయ కళా దర్బార్ - రాయలసీమ రంగస్థల జాతీయస్థాయి జానపద సంగీత, నృత్య పోటీలు ఆదరహోలా జరుగుతున్నాయి. శనివారం రాత్రి ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ జీఎస్ ప్రసాద్, రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ దొడ్డ రెడ్డి మనోహర్ రెడ్డి పాల్గొని విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. వీరికి సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి రాజా సన్మానించారు.

పోలియో చుక్కల విధులకు చెల్లించని డబ్బులు

- నేడు మరోసారి పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో పోలియో మహమ్మరిని తరిమికొట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం కొన్ని చోట్ల ఆభాసుపాలవుతోంది. కేంద్ర ప్రభుత్వం పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని విధులు నిర్వర్తించిన వైద్య సిబ్బందితో పాటు ఇతర శాఖల సిబ్బందికి డబ్బులు చెల్లించాలని విడుదల చేస్తే కొంతమంది అధికారులు ఈ డబ్బులను విధులు నిర్వర్తించిన సిబ్బందికి చెల్లించకుండా తమ జేబుల్లో వేసుకుంటు న్నారు. పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం జరిగిన రోజే ఈ నిధులను విధులు నిర్వర్తించిన సిబ్బందికి చెల్లించాల్సి వుండగా అత్యధిక ప్రాంతాల్లో ఈ నిధుల చెల్లింపు ఆలస్యంగా జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో వైద్యాధికారులు పోలియో చుక్కల విధులు నిర్వర్తించిన సిబ్బందికి డబ్బులు చెల్లించకుండా తమ జేబుల్లో వేసుకుంటున్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో విధులు నిర్వర్తించిన సిబ్బందికి చెల్లించాల్సిన డబ్బులను చెల్లించకపోవడంతో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం రోజు ఈ వార్తను 'ప్రభాతవార్త'తో ప్రచురించడంతో స్పందించిన అధికారులు హుటాహుటిన పల్స్ పోలియో విధులు నిర్వర్తించిన వైద్య సిబ్బందికి డబ్బులు చెల్లించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి ఈ నిధులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంకు విడుదలైనప్పటికీ మున్సిపల్ అధికారులు చేతివాటం ప్రదర్శించాలని నిర్ణయించి ఈ మేరకు వైద్య సిబ్బందికి చెల్లించాల్సిన నిధులు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేశారు. ఈ క్రమంలో గత డిసెంబర్‌లో జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో విధులకు హాజరైన కొంత మంది సిబ్బందికి ఇప్పటి వరకు వారికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించలేదని ప్రచారం జరుగుతోంది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చవటపల్లి అర్బన్ పిహెచ్‌సి పరిధిలో గత డిసెంబర్ నెలలో జరిగిన పోలియో చుక్కల కార్యక్రమంలో విధులకు హాజరైన సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లకు మెడికల్ ఆఫీసర్ డబ్బులు చెల్లించలేదు. ఈ క్రమంలో మెడికల్ ఆఫీసర్ బదిలీ కావడంతో పోలియో చుక్కల విధులు నిర్వర్తించిన సిబ్బంది తమ డబ్బుల కోసం మున్సిపల్ వైద్యాధికారులను పలుమార్లు అడిగినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆదివారం మళ్ళీ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంలో విధులకు హాజరైన వైద్య, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో చెల్లించడానికి చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

జనసేన రాష్ట్ర కమిటి సమావేశంలో శ్రీకాళహస్తి చర్చ

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త: జనసేన పార్టీ సమావేశం పార్టీ ప్రధానకార్యలయంలో శనివారం జరిగింది.ఈ సమావేశానికి శ్రీకాళహస్తి నుంచి దండి నరేంద్రతో పాటు సహచరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాబోవు రో జుల్లో నియమించనున్న కొత్తకమిటిల కార్యచరణ మరింత వేగవంతంగా సాగుతుందని కార్యకర్తలకు వివరించారు. కమిటి భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు జారి చేసారు.నేడు పరిపాలనలో అధ్యయనం చేయాల్సిన అంశాలకు సంబంధించి పవన్‌కళ్యాణ్ వివరించినట్లు తెలిసింది.ఈ సమావేశంలో సీనియర్‌నాయకులు విఎన్‌వి ప్రసాద్‌లోకం, పంతం నానాజి, రామ్‌తాళ్ళూరి, మంత్రి కందుల సురేష్, టి.శివశంకర్‌లు హాజరుకాగా శ్రీకాళహస్తి నుంచి హాజరైన దండినరేంద్ర బృందం కలసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఇక్కడ రాజకీయ పరిస్థితి, నూతన కమిటి కార్యాచరణ పార్టీ బలోపేతం,పార్టీలో కొత్తగా చేరికలు, నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించినట్లు సమాచారం. అలాగే రాబోవు పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సంబంధించి సంస్థాగతంలో బలోపేతం వంటి కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం.ఈ సమావేశంలో పార్టీల భవిష్యత్తు, కార్యాచరణకు మరింత స్పష్టతను సానుకూల దిశను అందించాయని దండి నరేంద్ర వివరించారు.

శివయ్య సేవలో మున్సిపల్ కార్యదర్శి

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త: రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజలు జరిపించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశులు పర్యవేక్షణలో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్ బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఏవి కృష్ణారెడ్డి,రెవెన్యూ ఆఫీసర్ చంద్రకాంత్,రెవెన్యూ ఇన్సెపెక్టర్ బాలచంద్రలు స్వాగతం పలికారు.

ఓటర్ల నమోదులో జాగురూకతతో మెలగండి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త: రానున్న పంచాయతీ ఎన్నికలు కూటమి ప్రభుత్వానికి కీలకమని ప్రస్తుతం జరుగుతున్న 'సర్' కార్యక్రమాలను జనసైనికులు సద్వినియోగం చేసుకోవాలని జనసేన నాయకుడు దండి నరేంద్ర అన్నారు. శనివారం శ్రీకాళహస్తి మండలంలోని వేలవేడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆయనప్రత్యేకంగా పర్యవేక్షించారు.ఓటర్లను చైతన్యవంతుల్ని చేయటంతో మమేకమయ్యారు. వేలవేడు గ్రామంలో జనసేన సారథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలను దండి నరేంద్ర ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఈ మండలంలోని వేలవేడు పంచాయతీ పరిధిలో బిఎల్ఏ లక్ష్మణ్‌కుమార్, బిఎల్ఓ సాయికుమార్‌లు సమన్వయంతో సాగిస్తున్న పరిశీనలను అభినందించారు.ఈ మేరకు జనసైనికులు జవాబుదారి తనంతో పని చేయాలని సూచించారు.

పరశురామేశ్వరుని సేవలో ప్రముఖులు

ఏర్పేడు,జూన్ 27 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని నసేవలో శనివారం మంత్రి టిజి భరత్ సొదరుడు మద్దితేజ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు.వారికి ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు సారథ్యంలో వేదపండితులు ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు వేదపండితులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్ల చరిత్రను చైర్మెన్ వివరించారు. చేపడుతున్న అభివృద్ధికి సంబంధించి వివరించారు. కార్యనిర్వహణాధికారి సారథ్యంలో ఆశీర్వచనాలు అందించారు.

5 ఏళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త: ఆదివారం నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూపీహెచ్సీ శ్రీరామ్ నగర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డా. బాలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, గతంలో ఎన్నిసార్లు పోలియో చుక్కలు వేసినా ఈ ప్రత్యేక కార్యక్రమంలో మరోసారి వేయించడం అత్యంత అవసరమని తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముత్యాలమ్మ గుడికి స్థలం చూపించిన తహసీల్దార్

తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో ముత్యాలమ్మ గుడి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు తొట్టంబేడు తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె సర్వేనెంబర్ 291/1లో 38 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన భారతి శనివారం సర్వేయర్, వీఆర్వోలతో కలిసి పెద్దకన్నలి గ్రామంలో స్థల సేకరణకు పరిశీలించారు.ఆలయ నిర్మాణానికి స్థలాన్ని చూపించి, తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల్లా వైసీపీ తప్పుడు ప్రచారాలు

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త: మాదకద్రవ్యాలకు ఎంత దూరంగా ఉండాలో, సమాజానికి ప్రమాదకరంగా మారిన జగన్ పార్టీ ఫేక్ ప్రచారాలకు ప్రజలు అంతే దూరంగా ఉండాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మాసారపు సుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ నాడు సొంత పార్టీ వారిని, సామాన్యులను తాడేపల్లి ప్యాలెస్‌లోకి రానివ్వని జగన్ నేడు రోడ్లపైకి వచ్చి శవ రాజకీయాలు, డ్రామాలు చేస్తున్నారని, లేనిపోని అపోహలు సృష్టిస్తూ తెలుగుదేశం పార్టీ, ఎన్డీయే కూటమిపై విష ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన పెంచుకోవాలని మాసారపు సుబ్బయ్య కోరారు.

వేతనాల ఎగవేత : రోడ్డెక్కిన కార్మికులు

ఏర్పేడు, జూన్ 27 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలో ఉన్న పుష్పిత్ స్టీల్ పరిశ్రమ యాజమాన్య నిరంకుశ వైఖరి మరో సారి బట్టబయలైంది. తమకు చెల్లించాల్సిన వేతనాలు ఇమ్మన్నందుకు కార్మికులకు మంచినీటి సరఫరాను బంద్ చేశారు. నలుగురు కార్మిక నాయకులను ఏర్పేడు పోలీస్ స్టేషన్ లో బంధించి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో తిరగబడ్డ కార్మికులు యాజమాన్యం తీరుకు నిరసనగా శనివారం విధులను బహిష్కరించారు. కాలినడకన, కాలిన కడుపుతో ఎండను, వానను సైతం లెక్క చేయకుండా శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ పుష్పిత్ స్టీల్ పరిశ్రమలో బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 200 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు అర్థాకలని అనుభవిస్తున్నా యాజమాన్యం కనికరం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్డీవో యాజమాన్యంతో తాను మాట్లాడినట్లు వివరించారు. సదరు కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వేతనాల చెల్లింపు పై యాజమాన్యం హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, రంగయ్య, అన్వర్ బాషా, పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించండి

శికాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త: గిరిజన గురుకులాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి గిరిజనుల సమస్యలను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు మాసారపు సుబ్బయ్య వివరించారు. శనివారం తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి, జిల్లాలోని గిరిజనులకు ఉన్నత విద్య, ఆరోగ్యం, ప్రత్యేకమైన గురుకులాల్లో వసతులు కల్పించాలని కోరారు. ప్రతి గిరిజన కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

పల్స్ పోలియోపై ర్యాలీ

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 27 ప్రభాతవార్త: ఆదివారం నాడు జరిగేటటువంటి పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పల్స్ పోలియోపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వచించి విజయవంతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం నాడు జరిగేటువంటి పల్స్ పోలియో కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 30 బూతులను ఏర్పాటు చేసి మండలంలోని 3891 మంది ఐదు సంవత్సరముల లోపు పిల్లలకు ఈ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ ఆరోగ్య అధికారి డిఎన్. వెంకటేశ్వర్లు ఆరోగ్య సిబ్బంది ఆశాలు అంగన్వాడీ టీచర్లు ఉపాధ్యాయులు పంచాయతీ సెక్రెటరీ మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు తెలిపారు.

29 నుంచి సబ్సిడీలో పచ్చి రొట్టె ఎరువులు పంపిణీ

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 27 ప్రభాతవార్త: పచ్చి రొట్టె ఎరువులు సబ్సిడీలో ఈనెల 29 నుంచి రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు అందించడం జరుగుతుందని వ్యవసాయ అధికారి షణ్ముగం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని రైతుబంధు కేంద్రాల్లో పచ్చి రొట్టె ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, కార్డు లింక్ ఉన్న ఫోన్ నెంబరు, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించవలసినదిగా తెలిపారు.ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పొందవలసినదిగా రైతు సోదరులకు తెలియజేస్తున్నారు.

కారణి సర్ సర్వేను ఎమ్మార్వో పరిశీలన

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 27 ప్రభాతవార్త: భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కారణి పంచాయతీలో జరుగు సర్వేలో ఎమ్మార్వో లక్ష్మీనారాయణ శనివారం స్వయంగా పరిశీలించడం జరిగింది. ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, ఆర్.ఐ నల్లయ్య, బిఎల్ఓలతో కలసి పరిశీలించి ఎమ్యురేషన్ ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ నల్లయ్య,బీఎల్ఓ విజయ, ,తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కందేరి కార్తీక్ చౌదరి ప్రజలు పాల్గొన్నారు.

కొలుపు జాతరలో... రిషితా రెడ్డి

తొట్టంబేడు,జూన్ 27 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం చిట్టత్తూరు. గ్రామ అరుంధతి వాడలో జరుగుతున్న మాతమ్మ కొలుపు జాతరలో శనివారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాతమ్మ తల్లి అమ్మవారి కొలుపు సందర్భంగా రిషితా రెడ్డి హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.ఆమెతోపాటు కన్నలి ప్రతాప్‌రెడ్డి, బాలాజి రెడ్డి, శివకుమార్‌రెడ్డి, బాబురెడ్డి,మణి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

-ఈస్ట్‌లో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి,జూన్ 27ప్రభాతవార్త: ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. గంజా, ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణా, వినియోగంపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. గంజా విక్రయదారులు, సరఫరాదారులు, మధ్యవర్తులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించారు.శనివారం రాత్రి తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిపాలన, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలపై సమీక్షించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, బీట్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే బైండోవర్ చర్యలు, పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు చేపట్టి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం,ఎస్‌బి సిఐ విక్రమ్ ఉన్నారు.

పేదల వైద్యానికి ప్రభుత్వ భరోసా: ఆరణి

వైద్య బాధితులకు రూ.8.43 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

తిరుపతి విద్య జూన్ 27 ప్రభాత వార్త

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎనిమిది మంది లబ్ధిదారులకు మొత్తం రూ.8,43,852 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్ధిదారుల్లో ఎల్వోసీ కింద పరంధామ నాయుడుకు రూ.3.06 లక్షలు, జీవకోన రాజీవ్‌నగర్‌కు చెందిన గోవిందయ్యకు రూ.1.53 లక్షలు, ముత్తురాణికి రూ.41 వేలు, మధురానగర్‌కు చెందిన రమేష్‌కు రూ.41 వేలు, రేఖకు రూ.1.18 లక్షలు, కొత్తపల్లికి చెందిన నాగరాజరెడ్డికి రూ.40 వేలు, శ్రీనివాసులకు రూ.42 వేలు, పోస్టల్ కాలనీకి చెందిన వరలక్ష్మికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆస్పత్రుల పాలైన నిరుపేద కుటుంబాలకు చికిత్స ఖర్చులు భారంగా మారకుండా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం పారదర్శకంగా ఈ సహాయాన్ని చేరవేస్తోందని చెప్పారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సైతం ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

తిరుపతి డివిజన్

గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక రెట్టింపు

తిరుపతి, జూన్ 27 ప్రభాతవార్త: తిరుపతి నగరం శనివారం తెల్లవారు జామున భక్తి పారవశ్యంలో మునిగి పోయింది. భజన మండలి సభ్యులు శనివారం చేపట్టిన నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో గోవింద నామస్మరణల మధ్య మేళతాళాలు, మంగళ వాయిద్యాల నాదంతో నగర సంకీర్తన చేశారు. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ముగించారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు, ప్రముఖ ప్రవచనకర్త చంద్రమోళి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, జ్యోతి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, వెంకటాద్రి, , అరుణమ్మ, జయమ్మ, విజయ కుమారి, అమరావతి, శ్రావణి, పావని, ఉషశ్రీ, రేవతి, ఉమా జి, పద్మ, వైపద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, కల్పన, నాగరాజామ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో పోలియోచుక్కల శిబిరాలు

తిరుమల, జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులు కూడా తమ 0-5ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం టిటిడి తిరుమలలో అన్ని ఏర్పాట్లు చేపట్టింది. తిరుమలలో అన్ని ప్రాంతాల్లో ఈ పోలియో చుక్కలు (నేడు)ఆదివారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటలవరకు వైద్యఆరోగ్యసిబ్బంది ప్రత్యేక శిబిరాలు వద్ద అందుబాటులో ఉంటారు. శనివారం ఉదయం తిరుమలలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఎస్వీ హైస్కూల్ నుండి బాలాజీ నగర్ వరకు నిర్వహించారు.

కమనీయం కల్యాణవేంకటేశ్వరుని ఊంజల్‌సేవ

నారాయణవనం, జూన్ 27 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో శనివారం సందర్భంగా భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం 6గంటల నుంచి గంటపాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. వినిపించారు.

బాధితులకు 3.19లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నారాయణవనం, జూన్ 27 ప్రభాతవార్త : సత్యవేడు నియోజకవర్గంలో పలు కారణాల వల్ల ఆస్పత్రి ఖర్చులకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మంజూరు చేసిన 3లక్షల18వేల 778రూపాయాల చెక్కులను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో వున్న వారికి ఈ సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయంగా వుంటుందన్నారు. దీనికి సిఎం నారాచంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నాగలాపురం మండలం బైటుకొడిబేడుకు చెందిన పి చిరంజీవి 72,254, పిచ్చాటూరు మండలం కారూరు చెందిన పార్వతీకి 36,509, రామగిరికి చెందిన బి సురేష్ 20,524, మునెమ్మకు 1,88,788 రూపాయాల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సుబ్రమణ్యం, టిడిపి నియోజకవర్గ స్థాయి నాయకులు మల్లికార్జునరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, ఇంకా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మ్యాపింగ్ చేసుకోకుపోయిన ఓటుకు డోకా వుండదు

నియోజకవర్గ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ రోజ్ మండ్

నారాయణవనం, జూన్ 27 ప్రభాతవార్త : ఓటర్లు కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగా మ్యాపింగ్ చేసుకోకపోయిన తగిన ఆధారాలు సమర్పిస్తే సరిపోతుం దని సత్యవేడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ రోజ్ మండ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నారాయణవనంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రగతిపై పలువురు బిఎల్ఓలు, ఎలక్షన్ సిబ్బందితో సమీక్ష నిర్వంచారు. ఓటర్లు మ్యాపింగ్ సంబందించి ఎవ్వరు బయపడాల్సిన అవసరం లేదన్నారు. మ్యాపింగ్ కానీ ఓటర్లకు నోటీసులు పంపితే వెంటనే ఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల గుర్తింపుతో ఏదో ఒకటి సమర్పిస్తే ఓటర్ల జాబితాలో ఓటును తొలగించరాదన్నారు. ఇప్పటికే సర్ ప్రక్రియ కార్యక్రమం జరుగుతుందని మరింతగా ఓటర్లకు అవగాహన కల్పించి పూర్తి చేయాలన్నారు. అనంతరం నారాయణవనంలో ఓటర్లతో నేరుగా ఆమె కలిశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు భార్గవి, ఆర్ఐ అంజేరమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం మన కిచ్చిన హక్కు

మాజీ మంత్రి ఆర్‌కె రోజా

నింద్ర, జూన్ 27 ప్రభాతవార్త : ఓటు రాజ్యాంగం మన కిచ్చిన హక్కు, దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని మాజీ మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. శనివారం మండలంలోని ఇరుగువాయి, జియన్ కండ్రిగ పరిధిలోని 194,195 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ ప్రక్రియకు సంబందించిన సమస్యలపై మాజీ మంత్రి ఆర్‌కె రోజా వైయస్ఆర్‌సిపి పార్టీ బియల్ఎలు, వ ండల పరిశీలకులు, స్థానిక నాయకులతో సమావేశమై క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ఈసందర్భంగా బూత్‌లవారిగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు అర్హులైన ఓటర్లు పేర్లు తొలగింపు, పారాల దాఖలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి బూత్‌లో సర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ , ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ శ్రేణులకు అప్రమత్తంగా పని చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, నియోజకవర్గ బూత్ కమిటి అధ్యక్షులు సురేష్, మాజీ యంపిపి దీపాజలందర్‌రాజు నాయకులు అనిల్, శ్యామ్‌లాల్, మునిక్రిష్టరెడ్డి, తోయజాక్షిరెడ్డి, సత్యరాజ్, చంద్రబాబురెడ్డి, దాము, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ప్రభుత్వ విప్ డాక్టర్

కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం కృష్ణం శెట్టిపల్లి గ్రామంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా సీఎంకు ఆయన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సంజీవని కార్యక్రమం ,పార్టీ కేడర్ తో జరిగిన సమావేశం కు హాజరయ్యారు.

డమరకనాథ గుప్తకు డాక్టరేట్ ప్రధానం

చిన్నగొట్టిగల్లు :ప్రభాతవార్త : చిన్నగొట్టిగల్లు కు చెందిన భాగ్య లక్ష్మి స్టీల్ మరియు సిమెంట్ అధి నేత డమరకనాథ గుప్తా కు సమాజ సేవ, యువత సాధికారిక, ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు హోసూరులో జరిగిన కార్యక్రమంలో సోషల్ సర్వీస్ విభాగంలో డాక్టరేట్ ప్రధానం చేశారు గత కొన్ని సంవత్సరాలుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడుగాను ట్రెజరర్ గా తిరుపతి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడుగా పనిచేశారు ఇతర సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రధానం చేశారు డాక్టరేట్ అందుకున్న డమరకకు పలువురు అభినందించారు

ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయండి

కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించండి... కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 27 ప్రభాతవార్త

ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (సర్) ప్రక్రియను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శార దా దేవి అధికారులు, సిబ్బందిని ఆదేశం చారు. శనివారం ఉదయం నగరంలోని పోస్టల్ కాలనీ లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను, పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ పారాలను ఇప్పటికే అందరికీ చేర్చడం జరిగిందని తెలిపారు. బి.ఎల్.ఓ.లు అందరి ఇండ్లకు వెళ్లి ఈ పారాలను గూర్చి కూలంకుశంగా వివరించి తప్పులు లేకుండా పూర్తి చేయించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రత్యేక కార్యాచరణతో ఓటర్ల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, శానిటరీ సూపర్వైజర్ సుమతి, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

నేడు పల్స్ పోలీయో విజయవంతం కోసం అవగాహన ర్యాలీ

నారాయణవనం, జూన్ 27 ప్రభాతవార్త : ఆదివారం పల్స్ పోలీయో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ప్రజల్లో లవగాహన కోసం శనివారం ఉదయం వైద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు దర్శిత్ రాజ్, రాగసుధలు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7గంటల నుంచే పోలీయో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. 0నుంచి5 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికి పోలీయో చుక్కలను తప్పని సరిగా వేయించాలని కోరారు. అనంతరం నారాయణవనం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు అందరు పాల్గొన్నారు.

ఎంఎల్ఏపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం.!

టిడిపి యువ నాయకుడు తాతిరెడ్డి వెంకటేష్ రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 27 ప్రభాతవార్త: చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నానిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని టిడిపి యువ నాయకుడు తాతిరెడ్డి వెంకటేష్ రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులు చూసి కొంత మంది ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో వుంటూ వైసిపి తొత్తులుగా మారడం భాధాకరమన్నారు. మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాయలోపడి మేడసాని పురుషోత్తం నాయుడు ఈ విధంగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. ఇకనైనా ఎంఎల్ఏపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోనట్లయితే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వ్యవసాయ మోటార్ల స్టాటర్లు చోరీ

రామచంద్రాపురం, జూన్ 27 ప్రభాతవార్త: సికె పల్లి, సూరావారిపల్లి, గొల్లపల్లి, నెత్తకుప్పం పరిసర ప్రాంతాల్లో పంట పొలాల్లో వున్న వ్యవసాయ మోటార్ల స్టాటర్లు, వైర్లను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దోచుకుపోయారు. సుమారు 35 మంది రైతులకు సంబంధించిన కాపర్ వైర్లను తస్కరించుకుని వెళ్లారు. మోటారు పంపు సెట్లను ధ్వంసం చేశారు. విద్యుత్ వైర్లు, స్టాటర్లు చోరీకి గురికావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఛాయాపురంలో శనైశ్చరస్వామికి ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, జూన్ 27 ప్రభాతవార్త: రాయలచెరువు సమీపంలోని ఛాయాపురంలో వెలసియున్న శనైశ్చర స్వామి వారికి శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రమణ్యశర్మ శనైశ్చరస్వామి తైలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అష్టమ శని, అర్ధాష్టమ శని, ఏలినాటి శని నివారణకు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలియో రహిత సమాజమే మన లక్ష్యం: డాక్టర్ సుమలత

నింద్ర, జూన్ 27 ప్రభాతవార్త : పోలియో రహిత సమాజమే మన లక్ష్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుమలత తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రారంభమై పురవీధుల గుండా స్లోగన్ చెప్పుకుంటు వెళ్ళారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 0నుండి5 సంవత్సరం పిల్లలందరికి ఈనెల 28వతేది అధివారం మీ గ్రామంలోని పల్స్‌పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండలంలో మొత్తం 2126 మంది పిల్లలకు 30 బూత్‌లలో ఉదయం 7గంటల నుండి పల్స్ పోలియో చుక్కలు వేసే విధంగా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటి హెచ్ఇఒ యన్ గోపి, సిహెచ్ఒశ్రీదేవి, హెచ్ఏ వరలక్ష్మ, ప్రసాద్, ఓపి, స్టాప్ఎయన్‌యం, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై పోలీసులు కొరడా

14 ట్రాక్టర్లు, ఒక జెసిబి సీజ్

రేణిగుంట జూన్ 27 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసులు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసరావు సూచనల మేరకు సీఐ మంజునాథరెడ్డి నేతృత్వన ఎస్సై హరీష తమ సిబ్బందితో శనివారం ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝులిపించారు. కుట్రమంగళం , పిల్లపాలెం స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలో ఇసుక మాఫియా చేస్తున్న అక్రమ ఇసుక రవాణా పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14 ట్రాక్టర్లు, ఒక జెసిబి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 14 ట్రాక్టర్లను, జెసిపిని గాజులమండ్యం పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. ప్రకృతి సంపద అయిన ఇసుకను అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరీష సమక్షంలో సీఐ మంజునాథరెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్‌లో గీతం విద్యార్థుల సత్తా

తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త

త్రిపురాంబికకు ద్వితీయ స్థానం.. గురువర్షిణికి తృతీయ స్థానం

రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్‌లో గీతం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరోసారి పాఠశాల ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటారు. వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో గీతం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం విశేషం. అండర్15 ఓపెన్ విభాగంలో పోటీపడిన వి. త్రిపురాంబిక మొత్తం 184 మంది పోటీదారుల మధ్య ద్వితీయ స్థానం సాధించి తన అసాధారణ చెస్ నైపుణ్యం, ఏకాగ్రత, వ్యూహాత్మక ఆలోచనతో అందరి ప్రశంసలు అందుకుంది. కఠినమైన పోటీలో నిలకడైన ఆటతీరుతో రన్నరప్‌గా నిలిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. అలాగే అండర్11 విభాగంలో 6వ తరగతి విద్యార్థిని వి. గురువర్షిణి అద్భుత ఆటతీరుతో తృతీయ స్థానం సాధించి గీతం పాఠశాలకు మరో విజయాన్ని అందించింది. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనమని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గీతం విద్యాసంస్థల కరస్పాండెంట్ డా. తమ్మినేని వేంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఇలాంటి విజయాలు సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల చైర్‌పర్సన్ పాలడగు విజయ విజేత విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కూడా విజేతలను అభినందిస్తూ, వారి విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు విజేతలను ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని

కెనరా బ్యాంక్ ‍केनरा बैंक Canara Bank
Syndicate
Together we can

తడ శాఖ

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002లోని రూల్3 తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ **కెనరా బ్యాంకు, తడ శాఖ వారి** యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు నోటీసులో తెలిపిన మొత్తం **రూ.17,89,088.20/- (పదిహేడు లక్షల ఎనభై తొమ్మిది వేల ఎనభైఎనిమిది రూపాయల ఇరవై పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులను** సదరు నోటీసు అందుకున్న తేది నుంచి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసినదిగా రుణగ్రహీత **జి.చిరంజీవులు** రెడ్డి గారిని కోరుతూ **15.04.2026వ** తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని నిబంధన 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని **22.06.2026వ తేదీన** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారులకు, సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏ వ్యవహారం జరుపరాదని, ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏవేని వ్యవహారాలు జరుపదలిస్తే **కెనరా బ్యాంకు వారికి రూ.17,89,088.20/- (పదిహేడు లక్షల ఎనభై తొమ్మిది వేల ఎనభైఎనిమిది రూపాయల ఇరవై పైసలు మాత్రమే)**మరియు దానిపై వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవి చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును.

సెక్షన్ 13(8) క్రింద సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం ఇవ్వడమైనదని రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

దిగువ తెలిపిన భూమి మరియు భవనాలు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులు మరియు అనుబంధాలతో జి.చిరంజీవులు రెడ్డి పేరున వున్నది.

షెడ్యూలు:- తిరుపతి జిల్లా తిరుపతి రిజిస్ట్రేషన్ జిల్లా, తడ మండలం, గ్రద్దగుంట గ్రామ పంచాయతీ, గ్రద్దగుంట రెవిన్యూగ్రామం సర్వేనెం.53-5లోని ఇంటి స్థలం యొక్క విస్తీర్ణం 4914 చ.అ. లేదా 546 చ.గ. లేదా 456.456 చ.మీ. లేదా 68 అంకణముల 18 చ.అ.

హద్దులు: తూర్పు: దువ్వూరు సుశీలమ్మ ఖాళీ స్థలం మరియు ఆశ మునిరాజ, ఆశ నరేష్ ఇళ్ళు, **దక్షిణం:** గ్రామ పంచాయతీ రోడ్డు, **పడమర:** అగరం గాజావల్లి ఆస్తి, **ఉత్తరం:** ఆశ రాంబాబు ఇల్లు.

కొలతలు: తూర్పు: 60అ. లేదా 18.306మీ. దక్షిణం: 81.2అ. లేదా 18.306మీ. పడమర: 60అ. లేదా 18.306, ఉత్తరం: 82.5 అ. లేదా 25.146 మీ.

స్థలం : తడ
తేది : 22.06.2026

సం॥ అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

సూళ్లూరుపేటలో ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త: భవిత కేంద్రంలో హెలెన్ కెల్లర్ నూట నలభై ఆరవ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు వి.టి భార్గవి, సాయి సంధ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమ తులను, బట్టలను అందజేశారు. ఎంఈఓ సునీల మాట్లాడుతూ శారీరక, మానసిక వైకల్యాలు ప్రతిభకు అడ్డు రావని తెలిపారు. అంథత్వం, చెవుడు, మూగ ఉన్నప్పటికీ వాటిని మానసిక ధైర్యంతో అధిగమించి హేళన కిల్లర్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారన్నారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ, ఎన్‌పిఆర్‌డి స్వచ్ఛంద సంస్థ, రోటరీ క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎం ఎం చంద్రబాబు, నరేష్, నాదెళ్ల శాంతి కుమారి, చక్రవర్తి, శ్రీనివాసులు, సూర్యకుమారి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

తారా స్థాయికి చేరిన సాగునీటి వ్యవహారం

దొరవారిసత్రం, జూన్ 27 ప్రభాతవార్త: ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శనివారం దొరవారిసత్రం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి, సాగునీటి సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రెండు ప్రాంతాల మధ్య ఏర్పడిన సాగునీటి వ్యవహారం తారాస్థాయికి చేరడంతో ఏ ప్రాంతానికి నష్టం కలిగించకుండా రైతులు మధ్య విభేదాలు తలచడంతో ఎమ్మెల్యే కలగజేసుకొని ప్రతి ఎకరమకు నీళ్ల అందే విధంగా సమస్య పరిష్కరి స్తామని తెలిపారు. అనంతరం సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని తెలుగు గంగా బ్రాంచ్ కెనాల్, గేట్లు, ఫీల్డ్ ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తాగునీరు, సాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి తెలుగు గంగా కాలువల ద్వారా తాగునీరు, సాగునీరు ఎటువంటి అంతరాయం లేకుండా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన నీటి సరఫరా నిరంతరం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాప్ ద్వారా రైతులకు ఎరువుల విక్రయాలు : ఏడిఏపి

వెంకటగిరి, జూన్ 27 ప్రభాతవార్త : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా ఎరువులు విక్రయిస్తామని వ్యవసాయ శాఖ ఏడిఏ పి అనసూయ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమం వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులు ఎరువులను సులువుగా కొనుగోలు చేసుకో వచ్చు అని తెలిపారు. యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు వల్ల చేయడం వల్ల రైతులకు ప్రభుత్వం అందించే ధరలకే ఎరువులు దొరుకుతాయి అన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్త వరిలో సమగ్ర పోషక ఎరువుల యాజమాన్యం మరియు చీడపీడల నివారణ చర్యల గురించి తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి పి సుజాత మాట్లాడుతూ ఈ ఖరీఫ్ కాలమునందు రైతులు తప్పనిసరిగా సాగు చేయు పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ వ్యవసాయ అధికారి జి ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి : తహసిల్దార్

వెంకటగిరి, జూన్ 27 ప్రభాతవార్త: సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బిఎల్‌వోలను తాసిల్దార్ పి శిరీష ఆదేశించారు. ఈసీఐ ఆదేశం మేరకు 27,28 తేదీల్లో స్పెషల్ క్యాంపు డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఇచ్చిన ఫామ్స్‌ను తిరిగి సేకరించాలని తెలిపారు. సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఇంటింటికి తిరిగి సర్ కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సర్ ప్రక్రియను త్వరగతిన పూర్తి చేయాలి

బాలాయపల్లి, జూన్ 27 ప్రభాతవార్త: సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బిఎల్‌వోలను తహసిల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. ఈసీఐ ఆదేశం మేరకు 27,28 తేదీల్లో స్పెషల్ క్యాంపు డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబలపూడి గ్రామాల జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటికి ఇచ్చిన ఫామ్స్‌ను తిరిగి సేకరించాలని తెలిపారు. సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఇంటింటికి తిరిగి సర్ కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనూహ్యంగా పెరిగిన రద్దీ

ఏడుకొండలవాడా ఏదీ నీ దర్శనం

తిరుమల, జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి: వారాంతం వరుససెలవులతో భారీగా భక్తులు తిరుమలకు చేరుకోవడంతో దర్శన కష్టాలు తప్పడం లేదు. వరుసగా మూడురోజులు శుక్రవారం నుండి ఆదివారం వరకు సెలవులు రావడంతో శనివారం ఉదయం 5గంటలకే వైకుంతమ్‌లోని కంపార్టుమెంట్లు నిండిపోయి ఐదుకిలోమీటర్లు గోగర్భమ్ డ్యామ్ వరకు వెలుపల భక్తుల లైన్లు ఉన్నాయి. ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేని సామాన్యభక్తులు ఈ లైన్లలోంచి ప్రవేశిస్తే ఆదివారం మధ్యాహ్నానికి నారాయణగిరిషెడ్లకు చేరుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఎక్కడ భక్తులు అక్కడే నిరీక్షించాల్సి వస్తుండటంతో సౌకర్యాలు కూడా అరకొరగానే ఉన్నాయని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 11గంటల ప్రాంతంలో గోగర్భమ్‌డ్యామ్, కల్యాణవేదిక ప్రాంతాల్లోని క్యూలైన్లలో నిలబడి నిరీక్షిస్తున్న భక్తులను పలకరిస్తే కనీస సౌకర్యాలు అందడంలేదని అసహనం చెందారు. తిరుమలకు అశేషంగా భక్తులు రావడంతో సామాన్యభక్తుల కష్టాలు మాత్రం ఆ వెంకన్నకే ఎరుక. వరుస సెలవులతో 24గంటల నుండి 30 గంటలు నిరీక్షించాల్సి న పరిస్థితులు వున్నాయి. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. పెరిగిన రద్దీతో శనివారం మధ్యాహ్నాం 12గంటలకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేసే టైమ్‌స్లాట్ టోకెన్లను ఉదయం 9గంటలకే మూడు గంటల ముందే ఇచ్చేయడంతో సమయానికి వచ్చిన భక్తులు నిరసన తెలిపారు. సమయానికి గాకుండా ముందే ఎలా జారీచేస్తారని, తామంతా ఆ దేవుని దర్శనమ్ ఎలా చేసుకోవాలని ఆందోళన చేపట్టారు.

గణనాధుని దర్శించుకున్న పలువురు హైకోర్టు జడ్జిలు

కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని శనివారం పలువురు హైకోర్టు జడ్జిలు దర్శించుకున్నారు. ఈమేరకు ఏపీ రాష్ట్ర హైకోర్టు జడ్జ్‌లు చిత్తూరు పోర్ట్ పోలియో న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ టిబి.శేఖర్‌లు కుటుంబ సమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శిచుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో చిత్తూరు జిల్లా జడ్జ్ అరుణ సాగరిక, ఆలయ ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహతిలో మైమరిపిస్తున్న ...చిన్నారుల నృత్యోత్సవాలు

-ఆకట్టుకుంటున్న కళాబృందాలు

తిరుపతి, జూన్27ప్రభాతవార్త: శ్రీకృష్ణదేవరాయ కళా దర్బార్ – రాయలసీమ రంగస్థలం జాతీయస్థాయి జానపద సంగీత, నృత్య పోటీలు కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా జరుగుతున్న ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలు తమ అద్భుతమైన జానపద సంగీత, నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వివిధ కళాబృందాలు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్లతో ప్రశంసలు అందుకున్నాయి. అనంతరం బహుమతి ప్రదానోత్స వంలో మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్యే మోహన్, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీఎన్‌పీయూసీ నగర అధ్యక్షుడు కస్పా పద్మనాభం తదితరులు పాల్గొని విజేతలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, వాటిని భావితరాలకు అందిం చేందుకు ఇలాంటి జాతీయస్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న రాయలసీమ రంగస్థలం సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి రాజాతో పాటు నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

టిటిడి సిబ్బంది సౌలభ్యం కోసం

ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు

తిరుమల, జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో టిటిడిలో వివిధ రకాలుగా సేవలందిస్తున్న ఆరోగ్య శాఖ పారిశుధ్య కార్మికుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. తిరుపతి నుండి ప్రతి రోజు తిరుమలకు వచ్చి విధులలో పాల్గొనేందుకు ప్రతినిత్యం కార్మికులు సమయాభావంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరయ్యే క్రమంలో ప్రతిరోజు ఆలస్యం అవుతుండడాన్ని గుర్తించిన డిప్యూటీ ఈఓ సోమన్నారాయణ ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. టిటిడిలో దాదాపు 800 మంది ఔట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు మూడు షిఫ్టుల విధానంలో తిరుమలలో పనిచేస్తున్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ప్రతినిత్యం ఉదయం తిరుమలకు వచ్చి విధి నిర్వహణ పూర్తిచేసుకుని తిరుపతికి వెళుతుంటారు. టిటిడి కార్మికుల కోసం విధులకు సమయానికి కచ్చితంగా హాజరయ్యేందుకు ఇబ్బంది లేకుండా ఈ బస్సులు శనివారం నుండి అందుబాటులోకి వచ్చాయి.

రమణ విలాస్ సర్కిల్ వద్ద టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

-కారుతో సహా 5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం...

రేణిగుంట జూన్ 27 ప్రభాతవార్త : జిల్లా టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏఎస్పి కులశేఖర్ నేతృత్వంలో డీఎస్పీ ఎండి షరీఫ్ మార్గ నిర్దేశం నందు రైల్వే కోడూర్ ఆర్ఎస్ఐ బాల చెంచయ్య ఆయన టీం ఎఫ్ ఆర్ ఓ సుభాష్ సిబ్బందితో కలిసి రేణిగుంట శ్రీకాళహస్తి మార్గంలోని రేణిగుంట రమణ రమణ విలాస్ సర్కిల్ వద్ద శనివారం తెల్లవారుజామున దాడులు నిర్వహిస్తున్న తరుణంలో ఒక ఎర్ర చందనం స్మగ్లర్ను అరెస్ట్ చేసి ఒక కారు ఐదు ఎర్ర సందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా జిల్లా ఎర్రచందనం టాస్క్ ఫోస్ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బంది తిరుపతి చెన్నై మార్గంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. టాస్ఫోర్స్‌ను చూసి వేగంగా వస్తున్న ఒక కారు రమణ విలాస్ సర్కిల్కు కొద్ది దూరంలో ఆపి అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పరారీకి సిద్ధమయ్యారు. విషయం గ్రహించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని వెంబడించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కారును అందులో ఉన్న ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి కేరళ రాష్ట్రం కోలి కోడ్ జిల్లాకు చెందిన వ్యక్తిగా నిర్ధారించారు. పట్టుబడిన వ్యక్తితో సహా కారును ఎర్రచందన దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏసిఎఫ్ శ్రీనివాస్ విచారణ జరపగా సీఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి రూరల్ ఎంఈవోల తీరుపై డీఈఓ ఆగ్రహం

తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండల విద్యాశాఖ కార్యాలయంలో అధికారుల తీరుపై జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కె.వి.ఎన్. కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆకస్మికంగా కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన, పరిపాలనలో లోపాలు, రికార్డుల నిర్వహణలో నిరక్ష్యం, ఇద్దరు మండల విద్యాశాఖ అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తనిఖీ సందర్భంగా డీఈఓ సమక్షంలోనే ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులు పరస్పరం వాగ్వాదానికి దిగడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ అధికారులుగా హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యతను విస్మరించి, కార్యాలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో వెంటనే మార్పు తీసుకురావాలని, వ్యక్తిగత విభేదాలను పక్కనబెట్టి పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఇద్దరు అధికారులను డీఈఓ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణ, జవాబుదారీతనం, పారదర్శకత తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఇకపై నిరక్ష్యం, క్రమశిక్షణా లోపాలు లేదా అనుచిత ప్రవర్తన పునరావృతమైతే ఎలాంటి వెసులుబాటు లేకుండా కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడబోమని డీఈఓ స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ సేవా నియమావళికి అనుగుణంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, కార్యాలయాల్లో సమన్వయం, క్రమశిక్షణ, పారదర్శకతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని డీఈఓ సూచించారు.

ఐదేళ్ళలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు

-ర్యాలీని ప్రారంభించిన ట్రైనీ కలెక్టర్ వెంకటేష్ ప్రసాద్

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త: ఐదేళ్ళలోపు చిన్నారు లందరికీ ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి తీసుకెళ్ళి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని ట్రైనీ కలెక్టర్ వెంకటేష్ ప్రసాద్ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. జాతీయ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై అవగాహన కల్పించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,63,176 మంది 0–5 సంవత్సరాల పిల్లలు వున్నారని, జిల్లాలో ఆది, సోమ, మంగళవారాలు మూడు రోజుల పాటు పిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని కచ్చితంగా తల్లిదండ్రులు వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించుకోవడానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

ఘనంగా సత్య సాయి బాబా శోభాయాత్ర

వెంకటగిరి, జూన్ 27 ప్రభాత వార్త: పట్టణంలో సత్య సాయి బాబా శోభాయాత్ర ఘనంగా జరిగింది. శ్రీసత్యసాయి అఖండ జ్యోతి భగవాన్ శ్రీసత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుండి అఖండ జ్యోతి దేశవ్యాప్తంగా పర్యటిస్తు వెంకటగిరికి చేరుకుంది. పూర్ణ కుంభ స్వాగతంతో వేదమంత్రాలతో మంగళ వాయిద్యాలతో భజనలతో శోభాయాత్ర కాశీపేట, రాజవీధి, నగరి వెనకల వీధి, ఆంజనేయ స్వామి గుడి వీధి, బజారు వీధి, పోలేరమ్మ గుడి రాజాగారి నగరి మీదుగా శ్రీసత్యసాయి సేవా సమితి వద్దకు చేరుకుంది. మందిరంలో అఖండ జ్యోతిని ఉంచి భజన మంగళ హారతితో కార్యక్రమంతో ముగిస్తుంది. వెంకటగిరి మందిరంలోనే అఖండ జ్యోతిని ఉంచుతారని తెలిపారు. సత్య సాయి సేవ సమితి వారు అఖండ జ్యోతిని పురవీధుల్లో ఊరేగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. మేళ తాళాల మధ్య అఖండ జ్యోతి శోభాయాత్ర జరిగింది. ఆదివారం కూడా సత్యసాయి సేవా సమితి మందిరంలో ఉంచుతారని నిర్వాహకులు తెలిపారు.

పార్టీ కార్యకర్తల అండగా ఉంటా: నేదురుమల్లి

వెంకటగిరి, జూన్ 27 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటానని నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మండలం అగ్రహారం గ్రామ పంచాయతీలోని చిన్నన్న పేటకు చెందిన రాజారెడ్డి అనారోగ్యం నుండి కోలుకొని కుమారుడు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈమేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి వెంకటగిరి పట్టణంలోని త్రిభువని ఎన్క్లేవ్ అపార్ట్మెంట్లోని వారి యొక్క కుమారుడు వైద్యులు శివకృష్ణారెడ్డి నివాసం వద్దకు చేరుకొని కుటుంబ సభ్యుల పరామర్శించారు. 13వ వార్డు మల్లమ్మ గుడి వీధిలో చేమూరు ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజారెడ్డి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, నాయకులు నాగయ్య, మురళీకృష్ణ తదితరు ఉన్నారు.

వాసవి అమ్మవారి కుంబాభిషేకానికి సన్నాహాలు

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని శివయ్య సన్నిధికి సమీపంలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంబాభిషేకానికి ఆలయ యువ కమిటి సన్నాహాలు చేస్తున్నారు. సుమారు రూ.20 లక్షల బడ్జెట్‌తో ఈ మహోత్సవాలను నిర్వహిం చుటకు పనులు చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు ముస్తాబులు చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో అమ్మవారి ఆలయాన్ని 1997లో అప్పటి ఆర్యవైశ్య సంఘానికి చెందిన జూలుగంటి హరినాధ్‌బాబు, జూలు గంటి సత్యనారాయణశెట్టి, రాజగోపాల్ శెట్టి, తన్నీరు హరినాథ్, మురారి జగన్నాధం శెట్టిలు ప్రతిష్టా త్మకంగా నిర్మించారు. అప్పటి వరకు శిధిలావస్థలో ఉన్న ఆలయాన్ని జీర్ణోద్ధారణ గావించారు. కుంబాభిషేకం జరిపారు. తరువాత ప్రస్తుతం యువ కమిటి సారధ్యంలో కుంబాభిషేకం జరుపుటకు నిర్ణయించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ ఇందుకుమార్ శర్మ పర్యవేక్షణలో కార్యక్రమాలను రూపొందించారు. కుంబాభిషేకానికి సంబంధించి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జూలుగంటి మురళి శుక్రవారం తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు కార్యక్రమాలను నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరిం చారు. ఈ నెల 30న సాయంత్రం గణపతి పూజలతో కార్యక్రమాలు ప్రారంభ మౌతాయి. జూలై 2న దేవి హోమాలు కళహోమం, దేవి ఖడ్గమాల హోమం, నవగ్రహ హోమాలు, ఉపపాలక జలాధి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించబడు తుందన్నారు. సాయంత్రం ఆడపడచులకు వడిబాల, అలాగే రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించుటకు నిర్ణయించినట్లు అధ్యక్షులు మురళి వివరించారు. ఈ మేరకు ఉత్సవాలకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని వారి కుటుంబసభ్యులను ఆహ్వానించారు.



శివయ్య సేవలో ప్రముఖుల సేవలు

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం అతిధులతో కిట కిట లాడింది. వచ్చిన అతిధులకు ఆలయ ఇఓ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌లు వ్యక్తిగతంగా స్వాగతాలు పలికారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఇఓ ఆదేశాలతో టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు. సిఆర్‌డిఏ కమిషనర్ విజయరామరాజు కుటుంబ సమేతంగా వాయులింగేశ్వరుని దర్శనానికి రాగా ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్దస్వాగతం పలికారు. వచ్చిన అతిధులకు చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు ఆదేశాలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు.

లోకేష్ సభాస్థలి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలన

రేణిగుంట, జూన్ 27 ప్రభాతవార్త: రేణిగుంట మండలం ఎల్లమంద్యం పంచాయితీ యోగానంద కాలేజీ పక్కన లోకేష్ సభాస్థలి కోసం శనివారం క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు.. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, ఎంపీడీవో రవిచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి సభ ప్రాంగణ స్థలాన్ని పరిశీలించారు. అయితే అక్కడ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును వికసిత భారత్ గ్యారంటీక రోజ్గార్ అవధిక మిషన్ గ్రామీణగా పేరు మారుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ముఖ్యమంత్రి సభాస్థలి కోసం పలు ప్రాంతాలను పరిశీలిస్తున్నారని అందులో ఈ స్థలం కూడా ఉందని అధికారులు చెప్పడంతో 23వ తేదీ వార్త దినపత్రికలో ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. ముఖ్యమంత్రి సభ స్థలాన్ని రైల్వే కోడూరు నియోజక వర్గం ఓబులవారిపల్లి ప్రాంతానికి మార్చినట్లు అధికారులు అంటున్నారు.. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సభ జరగాల్సి న చోట ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సభ జరుగుతుందని క్షేత్రస్థాయి లో స్థలాన్ని పరిశీలించడానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఎంపీడీవో రవిచంద్ర రూరల్ సీఐ మంజునాథ రెడ్డి తో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చారు. స్థానిక టిడిపి నేతలు తిరుపతి జిల్లా పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, జి పాలెం టిడిపి ఇన్చార్జి పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి తదితరులు అధికారులతో పాటు ఉన్నారు.

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి ఆలయ అనుబంధ ఆలయమైన శ్రీశ్రీశ్రీ కాశీ విశ్వేశరస్వామి ఆలయంలో శనివారం ప్రదోష కాలంలో నందికి విశేష అభిషకాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరస్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో స్వామిని, నందిని దర్శించుకున్నారు.

ప్రభాతవార్త, శ్రీకాళహస్తి